www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 67 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com మంగళవారం 23 - 06 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



రోప్‌వేతో భువనగిరి కోటకు కొత్త ఆకర్షణ.. అక్టోబర్ నాటికి సిద్ధం



## నేడు పులివెందులకు వై.ఎస్. జగన్

- ప్రజలను నేరుగా కలవనున్న వైసీపీ అధినేత
- పులివెందులలో మూడు రోజులు పాటు పర్యటించనున్న జగన్
- నేడు సాయంత్రం పులివెందులకు చేరుకోనున్న వైసీపీ అధినేత
- నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్న జగన్

**అమరావతి :**
వైసీపీ అధినేత జగన్ నేటి నుంచి తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో - మిగతా 2 లో

## ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి... జాగ్రత్తగా ఉండాలి
- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి :**
రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వాహనాల నంబర్ - మిగతా 2 లో

## ఏడు జన్మలెత్తిని తమను ఏమీ చేయలేరు



- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- విజయవాడ సాయికృష్ణ ఒక క్రిమినల్ అన్నట్టుగా పవన్ మాట్లాడుతున్నారు
- పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదన్న అంబటి
- ఏడు జన్మలెత్తిని తమను ఏమీ చేయలేరని వ్యాఖ్య
- పవన్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని చంద్రబాబును కోరుతున్నానన్న అంబటి

**అమరావతి :**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. విజయవాడ సాయికృష్ణ అదృశ్యం కేసు అంశంపై పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెబుతుంటే... మరోవైపు సాయికృష్ణను ఒక క్రిమినల్ అన్నట్టు పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జనసేన నేత సామినేని ఉదయభాను మాత్రం బాధితుడి ఇంటికి వెళ్లి పవన్ - మిగతా 2 లో



## ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

- రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీకి దాసోజు శ్రవణ్ లేఖ
- విదేశీ విధానాల్లో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలను పాటిస్తోందన్న శ్రవణ్
- ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టారని కాంగ్రెస్ నేత అన్నారని వ్యాఖ్య
- తెలంగాణలో ట్రంప్ టవర్స్‌కు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని విమర్శ

**హైదరాబాద్ :**
కాంగ్రెస్ పార్టీ విదేశీ విధానాల్లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శిస్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ లేఖ రాశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ చెప్పే జాతీయ, అంతర్జాతీయ సిద్ధాంతాలకు.. హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా 2 లో

## శివసేన అధినేత ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్



- షిండే వర్గంలో చేరిన ఆరుగురు ఎంపీలు
- లోక్‌సభలో 9 నుంచి 3కి పడిపోయిన యూబీటీ బలం
- ఆపరేషన్ టైగర్ విజయవంతమైందన్న ఏక్‌నాథ్ షిండే
- అభివృద్ధి నిధుల కోసమే పార్టీ మారామంటున్న ఎంపీలు
- ఎన్నికల తర్వాత అమ్ముడుపోయారంటూ ఉద్ధవ్ ఫైర్

**ముంబై :**
మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు సోమవారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గంలో చేరారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి షిండే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ పరిణామంతో 2022 నాటి చీలిక తర్వాత ఉద్ధవ్ పార్టీలో సంక్షోభం మరింత ముదిరనట్లయింది. షిండే వర్గంలో చేరిన వారిలో ఓంప్రకాశ్ భూపాల్‌సిన్హ, నగేష్ బాపురావ్ పాటిల్ అష్టికర్, సంజయ్ హరిబావ్ జాదవ్, సంజయ్ ఉత్తమ్ రావ్ దేశ్‌ముఖ్, భావుసాహెబ్ - మిగతా 2 లో

## బ్రిటన్ ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్
- పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు




## ఏనుగు పేడతో కాఫీ.. ఒక్క కప్పు ధర రూ.4,700!

- ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో కాఫీ తయారీ
- 'బ్లాక్ ఐవరీ కాఫీ'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- ఒక్క కప్పు ధర దాదాపు రూ.4,700
- కిలో ధర 2,000 డాలర్ల వరకు ఉండొచ్చు
- థాయ్‌లాండ్‌లో పరిమిత స్థాయిలో ఉత్పత్తి
- ఏనుగుల జీర్ణవ్యవస్థలో సహజ ప్రాసెసింగ్




## లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం

- భవనంపై నుంచి దూకిన విద్యార్థులు
- మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 14కు పెరిగింది
- కొనసాగుతున్న సహాయక చర్యలు, పలువురికి గాయాలు
- ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి




**లక్నో :**
ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలిగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ కమ్ గేమింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. విద్యాబోధనతో పాటు గేమింగ్ జోన్ కూడా నిర్వహిస్తున్న ఈ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా విస్తరించాయి. దట్టమైన పొగ, అగ్నికీలలు భవనాన్ని చుట్టుముట్టడంతో లోపల - మిగతా 2 లో



## నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా
- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం

**హైదరాబాద్ :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, - మిగతా 2 లో

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

- ఉద్యోగులకు, విద్యార్థులకు పోలీసుల కీలక అడ్వైజరీ
- ఉద్యోగులు, విద్యార్థులు ముందుగానే ఇళ్లకు వెళ్లాలని పోలీసుల సూచన
- సాయంత్రం 3:30 నుంచే కార్యాలయాలు మూసివేయాలని విజ్ఞప్తి
- రాష్ట్రవ్యాప్తంగా జూన్ 27 వరకు వర్షాలు కురిసే అవకాశం



**హైదరాబాద్ :**
తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు జారీ చేశారు. సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, ఇతర కార్యాలయాలు, విద్యాసంస్థలు సోమవారం నుంచి సాయంత్రం 3:30 గంటల నుంచే ఉద్యోగులను, విద్యార్థులను విడతల వారీగా ఇళ్లకు పంపాలని సూచించారు. భారత వాతావరణ శాఖ కథనం ప్రకారం, రాష్ట్రంలో జూన్ 27 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో - మిగతా 2 లో

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు



**హైదరాబాద్ :**
తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు - మిగతా 2 లో

# సంపాదకీయం

## నిరాశలో రైతాంగం!

తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్న అంశాల్లో ఒకటి. గాలి పీడనాల్లో మార్పులు, వాతావరణ ప్రవాహాల్లో ఏర్పడిన వ్యత్యాసాలు నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు.భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, జూన్ 4 నుంచి జూన్ 15 వరకు దేశవ్యాప్తంగా సాధారణంగా 53.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, వాస్తవంగా 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. గణాంకాలు మొత్తం భారతదేశానికి సంబంధించినవే అయినా, దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది.నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది.ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు.

## నేడు పులివెందులకు వెళుతున్న జగన్

**మొదటిపేజీ తరువాయి -** మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. నేటి నుండి జూన్ 25 వరకు సాగే ఈ పర్యటనలో ఆయన స్థానిక నేతలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలవనున్నారు. నేటి సాయంత్రానికి జగన్ పులివెందులకు చేరుకుంటారు. అక్కడ ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడికక్కడే 'ప్రజాదర్బార్' కూడా నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24 ఉదయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జగన్ సందర్శించనున్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. గుడి దర్శనం ముగించుకుని మధ్యాహ్నానికి మళ్లీ పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు రానున్న జగన్.. ఆ రోజు మొత్తం ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల అర్జీలను స్వీకరిస్తారు. అనంతరం మూడు రోజుల పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం పులివెందుల నుంచి తిరుగుపయనమవుతారు.

## ఏనుగు పేడతో కాఫీ.. ఒక్క కప్పు ధర రూ.4,700!

**మొదటిపేజీ తరువాయి -** కాఫీ ధరే సుమారు 50 డాలర్లు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,700కు పైమాటే. ఈ కాఫీ ప్రత్యేకత ఏంటంటే... గింజలను ఏనుగుల జీర్ణవ్యవస్థ ద్వారా ప్రాసెస్ చేస్తారు.కాఫీ గింజలను బియ్యం, అరటిపండ్లు, ఇతర పండ్లతో కలిపి ఏనుగులకు ఆహారంగా ఇస్తారు. ఆహారం జీర్ణమయ్యే సమయంలో కాఫీ గింజలు కూడా ప్రత్యేక ప్రక్రియకు లోనవుతాయి. 15 నుంచి 17 గంటల తర్వాత ఏనుగుల మల విసర్జన నుంచి ఆ గింజలను సేకరించి శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని ప్రాసెస్ చేసి కాఫీ తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కాఫీకి ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తుందని కాఫీ ప్రియులు చెబుతున్నారు.ఈ కాఫీ తయారీ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుంది. గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో అధిక శ్రమ అవసరం. అలాగే ఉత్పత్తి పరిమితంగా ఉండటం కూడా ధర పెరగడానికి కారణం. కాఫీలో చాక్లెట్, నట్స్, మట్టి వాసనల మిశ్రమ రుచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏనుగుల ఆరోగ్యానికి హాని కలగకుండా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి.

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

**మొదటిపేజీ తరువాయి -** జూన్ 24 వరకు ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.గతంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల కలిగే రద్దీని నివారించేందుకే ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు పేర్కొన్నారు.సోమవారం మధ్యాహ్నం వరకు నగరంలో భారీ వర్షం నమోదు కానప్పటికీ, రానున్న రోజుల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు

**మొదటిపేజీ తరువాయి -** తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు.కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

**మొదటిపేజీ తరువాయి -** తీసుకుంటుందని తెలిపారు.తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు.కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

**మొదటిపేజీ తరువాయి -** ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు. ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏడు జన్మలెత్తిని తమను ఏమీ చేయలేరు



**మొదటిపేజీ తరువాయి -** పంపిస్తేనే వచ్చామంటున్నారని, అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే 'సిట్' నాటకాలు ఆపి, సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.వైసీపీ నేతల తాటతీస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై అంబటి తీవ్రంగా స్పందించారు. "రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి మాట్లాడే భాషేనా ఇది మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు.అలాగే 'నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి అనిత సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని... అందుకే పవన్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని అంబటి గుర్తు చేశారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూనే.. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని వెనక ఉండి ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని దుయ్యబట్టారు.

## శివసేన అధినేత ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్



**మొదటిపేజీ తరువాయి -** రాజారామ్ వక్చౌరే, సంజయ్ దీనా పాటిల్ ఉన్నారు. వీరి చేరికతో లోక్‌సభలో యూబీటీ బలం 9 నుంచి 3కు పడిపోగా, షిండే వర్గం బలం 7 నుంచి 13కు పెరిగింది. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు (మూడింట రెండొంతుల మంది) పార్టీ మారడంతో, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వీరు అనర్హత వేటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.తాము పార్టీ మారడానికి గల కారణాలను అసమ్మతి ఎంపీలు వివరించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. శివసేన (యూబీటీ)లోని సీనియర్ నేతల నుంచి తాము విమర్శలు ఎదుర్కొన్నామని నగేష్ అష్టికర్ వెల్లడించారు. తన కుటుంబానికి సంబంధించిన కోర్టు కేసు విషయంలో షిండే, ఫడ్నవీస్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిగాయని ఓంరాజే నింబాల్కర్ తెలిపారు.ఈ చేరికలపై ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ, "ఆపరేషన్ టైగర్ విజయవంతంగా పూర్తయింది" అని ప్రకటించారు. మరోవైపు, ఉద్ధవ్ థాకరే ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. ఎన్నికల తర్వాత తమ ఎంపీలు అమ్ముడుపోయారని ఆయన ఆరోపించారు. పార్టీ వీడిన ఎంపీల నియోజకవర్గాల నుంచే తన రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభిస్తానని ఉద్ధవ్ ఈ సందర్భంగా ప్రకటించారు.

## లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి -** ఉన్నవారు చిక్కుకుపోయారు. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో కొందరు విద్యార్థులు భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం, పోలీసు యంత్రాంగం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి.అగ్ని ప్రమాదంలో మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 14కు పెరిగింది. పలువురు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం సేవలు అందించాలని, బాధితులకు అవసరమైన అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన సూచించారు.ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది కూలింగ్ ఆపరేషన్స్‌తో పాటు, భవనంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే అంశంపై గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తునకు అధికారులు ఆదేశించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా అనే కోణంలోనూ విచారణ చేపట్టనున్నారు.

# ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?



**మొదటిపేజీ తరువాయి -** చేస్తున్న 'రోడ్డు నాటకాలకు' అస్సలు పొంతన లేదంటూ ధ్వజమెత్తారు."గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారూ.. నేను ఈ లేఖను మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి రాయడం లేదు. జాతీయ స్థాయిలో ఏఐసీసీ చెబుతున్న సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధంగా తెలంగాణలో మీ సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న ప్రైవేట్ ఫ్రాంచైజీ-రాజకీయాలను బట్టబయలు చేయడానికే రాస్తున్నా" అని లేఖలో శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒకే విధమైన నిర్దిష్ట సిద్ధాంతం ఉందా, లేక రాష్ట్రాల్లో అవకాశవాదం కోసం విలువలను తాకట్టు పెడతారా అని నిలదీశారు.జూన్ 20న కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి పవన్ ఖేరా విడుదల చేసిన అధికారిక ప్రకటనను శ్రవణ్ ఈ లేఖకు జతచేశారు. ఆ ప్రకటన ప్రకారం... గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం 'ఇండియా ఫస్ట్' కాకుండా 'పీఆర్ ఫస్ట్' (ప్రచారం కోసం)లా సాగిందని కాంగ్రెస్ ఆరోపించిందని శ్రవణ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడం కోసం మన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారని, ట్రంప్ భారత్‌ను చిన్నచూపు చూస్తూ 'ఆదేశాల భాషలో' మాట్లాడుతున్నారని, ఆయన ముందు మోదీ మోకరిల్లడం 140 కోట్ల మంది భారతీయులకు సిగ్గుచేటని ఢిల్లీలో కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించిందని చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ట్రంప్‌ను అంతలా విమర్శించిన కేవలం మూడు రోజులకే.. అంటే జూన్ 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే డొనాల్డ్ ట్రంప్ కోసం హైదరాబాద్‌లో రెడ్ కార్పెట్ పరుస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో, యూఎస్ కాన్సులేట్ పక్కనే... కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఏకంగా 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'ను అధికారికంగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోందని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా ఈ రాజకీయ ద్వంద్వ నీతిని మీరు ఎలా సమర్థిస్తారంటూ రాహుల్ గాంధీని శ్రవణ్ సూటిగా ప్రశ్నించారు.

# బ్రిటన్ ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!



**మొదటిపేజీ తరువాయి -** బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు.2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు.రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు.అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం.స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

# పాక్‌కు రహస్య సమాచారం చేరవేత

**ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడు అరెస్ట్**

**బయటపడిన ఉగ్రకుట్ర**

**పాక్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు**

**అతడి నుంచి కీలక ఆధారాలు, ఫోన్ స్వాధీనం**



ఛత్తీస్‌గఢ్‌లో పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐకి చెందిన స్లీపర్ సెల్ సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని పంజాబ్‌కు చెందిన సేవక్ సింగ్ (23)గా గుర్తించారు. సేవక్ సింగ్ మొబైల్ కాల్ రికార్డులను పోలీసులు పరిశీలించగా, అనుమానాస్పద నంబర్లతో వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు తేలింది. దీంతో పాక్ ఐఎస్ఐతో సంబంధం ఉన్న ఈ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.పంజాబ్‌లోని తర్న్ తారన్ జిల్లాకు చెందిన సేవక్ సింగ్ గత నాలుగు నెలలుగా అకల్తారా నగరంలోని మినీ మాతా చౌక్‌లోని రాజీవ్ కేడియాకు చెందిన ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఒక బంధువు ద్వారా జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీలో ఉద్యోగం పొందాడు. ఆ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జాంజ్‌గిర్ చంపాలో నేరాల పెరుగుదల, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికుల రాక దృష్ట్యా అద్దెదారుల వివరాలను ధ్రువీకరించాలని ఎస్పీ విజయ్ కుమార్ పాండే స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ క్రమంలో అకల్తారా పోలీసులు సేవక్ సింగ్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లారు. అతడి వివరాలను కోరారు. అప్పుడు సేవక్ సింగ్ ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపించడంతో పోలీసులు అతడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించారు. ఆ మొబైల్‌తో నిందితుడు అనుమానాస్పద నంబర్లతో వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు వెల్లడైంది. ఈ కాల్ రికార్డులు, వీడియో సంభాషణల ఆధారంగా సేవక్ సింగ్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడని పోలీసులు గుర్తించి, వెంటనే అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. అలాగే ఈ అరెస్ట్ గురించి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు సమాచారం ఇచ్చారు.సేవక్ సింగ్ మొబైల్ ఫోన్‌లో ఐఎస్ఐకి సంబంధించిన అనేక కీలక వివరాలు పోలీసులకు లభించాయి. దీంతో పోలీసులు అతడ్ని మరింతగా ప్రశ్నించారు. అప్పుడు పోలీసులతో కీలక విషయాలు పంచుకున్నాడు సేవక్ సింగ్. సోషల్ మీడియాలో ఐఎస్ఐ వీడియోలు చూసిన తర్వాత ఒక నంబర్‌కు తన వివరాలు పంపానని చెప్పాడు. ఆ తర్వాత తనకు రూ.20,000 అందిందని వెల్లడించాడు. డబ్బు పంపిన వ్యక్తి తనను ప్రస్తుత లొకేషన్, ఆ ప్రాంతానికి సంబంధించిన వీడియోను పంపమని కోరాడని స్పష్టం చేశాడు. అప్పుడు తాను బిలాస్‌పుర్ జిల్లాలోని ఎన్‌టీపీసీ ప్లాంట్, జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీకి సంబంధించిన లొకేషన్ వివరాలు, వీడియోలను పంపానని చెప్పాడు. నిందితుడు సున్నితమైన ప్రాంతాలు, వాహనాల కదలికలు, వీడియోలు, ఛత్తీస్‌గఢ్‌లోని ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన వివరాలను అనుమానాస్పద నంబర్లకు పంపాడని జాంజ్‌గిర్ చంపా ఎస్పీ విజయ్ కుమార్ పాండే పేర్కొన్నారు. ఈ స్లీపర్ సెల్ ద్వారా ఒక పెద్ద కుట్రను అమలు చేయడానికి ఐఎస్ఐ ప్లాన్ చేస్తోందని తెలిపారు. ఈ కుట్రకు సంబంధించిన ఆధారాలు నిందితుడి మొబైల్ ఫోన్‌లోని చాట్‌లలో లభించాయని వెల్లడించారు. సేవక్ సింగ్ పంజాబ్‌కు వెళ్లినప్పుడు డ్రోన్ ద్వారా ఆయుధాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సామగ్రిని పాకిస్థాన్ నుంచి పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. వీటిని లక్షిత హత్యల కోసం ఉపయోగించాలని భావించారని అన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయడానికి పోలీసులు ఫోరెన్సిక్ బృందం సహాయం కూడా తీసుకున్నారని వివరించారు.జాంజ్‌గిర్ చంపా వంటి ప్రశాంతమైన జిల్లాలో పాకిస్థానీ నిఘా సంస్థకు చెందిన స్లీపర్ సెల్ సభ్యుడు పట్టుబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అయితే జాతీయ భద్రతకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత అప్రమత్తతతో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి అరెస్టుకు సంబంధించిన సమాచారం భద్రతా సంస్థల అధికారులకు పోలీసులు అందించనున్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం



# ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

## ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు,జూన్22.అక్షర టైమ్స్ :** గిద్దలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో, నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవో లతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే నీటి వనరుల స్థితిగతులు, బోర్‌వెల్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్వహణపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి ప్రజలకు నీటిపై ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే గ్రామ సచివాలయలు సందర్శించి సిబ్బంది పనితీరు మెరుగుపడేలా చూడాలని ఎంపీడీవో లకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఈ సమావేశంలో 6 మండలాల ఎంపీడీవో లు పాల్గొని మండలాల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితులను ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు తెలిపారు.

## ఎన్ఫోర్స్మెంట్ ను పెంచి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చేయాలి

**ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

**పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలి**

**మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత నిచ్చి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి**

**రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు మరింత ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**






**దర్శి,జూన్ 22.అక్షర టైమ్స్ :** పెండింగ్ లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. దర్శి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు, ఎన్ బి డబ్ల్యూ ఎస్ ,డిపిఓ పెండింగ్ రిప్లయ్స్ పై జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సోమవారం దర్శి పోలీస్ స్టేషన్ లో డిఎస్పీ, సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి, కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని, అరెస్టులు, చార్జ్ షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, చట్టవ్యతిరేక/అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చెయ్యాలన్నారు. అలాగే గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి కేసుల నమోదులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పేకాట, కోడి పందాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, వారిని బైండ్ ఓవర్ చేయాలనీ, బైండవర్ ఉల్లంఘించిన వారిపై తగ్గ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అలాగే ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మహిళా/పిల్లలు భద్రత, సైబర్ నేరాలు,రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన వంటి అంశాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రకాశం, మార్కాపురం రెండు జిల్లాల వ్యాప్తంగా 220 కుంభాకార దర్పణాలు (కన్వేక్స్ మిర్రర్స్ ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్లు మరియు ప్రమాదంలో జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో కుంభాకార దర్పణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్వీస్ రోడ్డు నుండి జాతీయ రహదారిపై ప్రవేశించే సమయంలో తప్పనిసరిగా వాహనాన్ని ఆపి, ఇరువైపులా పరిశీలించి తర్వాత మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ప్రజలు మరియు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి ప్రజల, మునిసిపల్ కార్మికుల వారి సహకారంతో వాటిని శుభ్రం చేయించటం జరిగిందని, అలా చేయటం ద్వారా న్యూసెన్స్ తగ్గి శారీరిక నేరాలు తగ్గాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బిసిఐ దేవ ప్రభాకర్, దర్శి సీఐ రామారావు, అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, చీమకుర్తి సీఐ ప్రసాద్ సబ్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

## ఈనెల 22 నుండి 27 వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు



**కురిచేడు,జూన్22.అక్షర టైమ్స్ :** రైతన్న మీకోసం వారోత్సవాలు ఈనెల 22 నుండి 27 వరకు ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో నిర్వహించబడతాయని మండల వ్యవసాయ అధికారి బి సంపత్ కుమార్ తెలియజేశారు. ఈ రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా దేకనకొండ మరియు బోధనంపాడు గ్రామాలలో ఈరోజు రైతన్న మీకోసం కార్యక్రమం లో పాల్గొని... ఏపీ ఏఐఎంఎస్ విధానం ద్వారా యూరియా మరియు డీఏపీ ఎరువులు విక్రయం కొనసాగుతుంది కాబట్టి ప్రతి ఒక్క రైతు వేసే పంటలను ముందుగానే రైతు సేవా కేంద్రం సిబ్బంది వద్ద నమోదు చేసుకోగలరని వాటి ద్వారా మాత్రమే శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారము యూరియా మరియు డిఏపి ఎరువులు ఇవ్వబడునని తెలియజేశారు.. అలాగే ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని రైతులు తక్కువ నీటితో పండే పంటలను పండించుకోవాలని, కంది సాగు చేసే రైతులు అంతర పంటగా సజ్జ పంటను సాగుచేసుకోవాలని, వరికి ప్రత్యామ్నాయ పంటలుగా జొన్న మొక్కజొన్న, సజ్జ వంటి పంటలను సాగు చేసుకోవాలని తెలియజేశారు. పచ్చి రొట్టె ఎరువులు అయినా జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనములు 50 శాతం రాయితీతో ప్రభుత్వం అంద చేస్తుందని కావలసిన రైతులు సంబంధిత రైతు సేవ కేంద్ర సిబ్బంది వద్ద నమోదు చేసుకోగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. రవికాంత్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు అనురాధ, హారిక మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రకాశం బిజినెస్ ఎలైట్ మీట్ - 2026 కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి,జూన్22.అక్షర టైమ్స్ :** ఒంగోలులోని ఎస్‌జీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రకాశం బిజినెస్ ఎలైట్ మీట్ - 2026 సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి , జేసి కల్పనా కుమారి , జిల్లా టిడిపి అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తో పాటు దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కలిసి పాల్గొన్నారు. మరియు స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ , ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ , సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు. పలువురు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు మరియు వివిధ రంగాల ప్రతినిధులతో సమావేశమై ప్రకాశం జిల్లా అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరియు యువతకు ఉద్యోగ కల్పనపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కొరత ఉండదు.. అక్రమాలకు తావులేదు

**డీలర్లు, కంపెనీలకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన హెచ్చరిక**

**బలవంతపు ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం**

**కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**నానో యూరియా, సహజ వ్యవసాయంపై అవగాహన పెంచాలని సూచన**

**ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పర్యవేక్షణ**

**ఎంఆర్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు, ఎరువుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**





**అమరావతి,జూన్22.అక్షర టైమ్స్ : (ఏపీ స్టేట్ బ్యూరో షేక్. కరిముల్లా) :** ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పటిష్ఠ పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలు పునరావృతమైతే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని హెచ్చరించారు. రైతులకు ఎరువుల బుకింగ్ కోసం అందుబాటులో ఉన్న యాప్ నిర్వహణ మరింత సజావుగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు ఆలస్యంగా రావడం, మెసేజ్ లింకులు సకాలంలో అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో పాటు పర్యావరణ హిత విధానాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అదే సమయంలో సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని, దీనిని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సంక్షేమం, ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ లు పద్ధతి మార్చుకోవాలి

**జిల్లా కలెక్టర్ హెచ్చరిక !!**



**మార్కాపురం,జూన్22.అక్షర టైమ్స్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో విధులను సక్రమంగా నిర్వహించకపోవడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడంతో 6 మంది బి ఎల్ ఓ లకు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**షోకాజ్ నోటీసులు అందుకున్న బి ఎల్ ఓలు**

మార్కాపురం పట్టణం 2వ సచివాలయం -- డి. పెద్ద మస్తాన్

మార్కాపురం పట్టణం 5వ సచివాలయం -- ఎస్.కే. సల్మా

మార్కాపురం పట్టణం 12వ సచివాలయం -- ఎం. శ్వేత

భూపతిపల్లి సచివాలయం -- జి. మహేష్ రెడ్డి

రాయవరం-1 సచివాలయం -- కె. శ్రీనివాసరావు

రాయవరం-1 సచివాలయం -- జి. ఆంజనేయులు

అదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పెద్దారవీడు మండలం, రామాయపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్. శ్రీనివాసులును సస్పెండ్ చేశారు.

ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఇకనైనా బి ఎల్ ఓ లు తమ పనితీరును మార్చుకుని విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రభుత్వ పాఠశాలకు పెద్దపేట.!

**సీఎం రేవంత్ అన్న సర్కార్ నిర్ణయం**

**నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి**





**ఉప్పల్,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దపీట వేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ హై స్కూల్ కు రూ.18 కోట్లు, కుషాయిగూడ జిల్లా పరిషత్ హై స్కూల్ కు రూ.19 కోట్ల చొప్పున పాఠశాలల అప్ గ్రేటెషన్స్ కు నిధులు మంజూరు చేయించినట్టుగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాచారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు వసునూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు.సోమవారం నాచారం డివిజన్‌లోని వెస్లీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి స్ఫూర్తితో విద్యకు పెద్దపీట వేస్తున్నాం.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం మా బాధ్యత చదువుతోనే పేదరికం పోతుంది, సమాజం మారుతుంది.ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది అని అన్నారు.వందలాది మంది విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వసునూరి ప్రకాష్ రెడ్డి ,బి శ్రీకాంత్ గౌడ్ ,హెచ్.ఆర్. మోహన్ ,జి. కృష్ణా రెడ్డి గారు ,రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, సుధాకర్ రెడ్డి, నూతనకంటి రాజు, బాలరాజు, కాప్రా సాయి, నరసింగ్ రావు, సునీల్ రెడ్డి, రఘు, కృపాకర్, అజీమ్, కోటేష్, కోత వెంకటేష్ గౌడ్, ఖయ్యూం, ఫహీమ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యూసుఫ్, షాహిక్, రేవంత్, జాఫర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.మహిళా నాయకులు ఉమా, భావనా గౌడ్, భారతమ్మ, ఛాదు పాల్గొన్నారు. అలాగే పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ఎంఈఓ రామారావు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, న్ స్ యూ ఐ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గండేపల్లి మండలం లో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**గండేపల్లి,జూన్22.అక్షర టైమ్స్ :** గండేపల్లి మండలంలో సోమవారం జగ్గంపేట శాసనసభ్యులు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గ్రంధి సుబ్రమణ్యం భార్య మహాలక్ష్మి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, మురారి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గురజాల వెంకన్న దొర తండ్రి కృష్ణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన చంద్రాల మల్లేశ్వరరావు అత్తగారి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించే ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, క్లస్టర్ ఇంచార్జి జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, సొసైటీ చైర్మన్ దిడ్డి శ్రీను, కాటేపల్లి భద్రం, గద్దె అబ్బన్న, ఉండవల్లి బుల్లయ్య, చంద్రాల పెద్ద వెంకన్న, జాస్తి రాధాకృష్ణ, కొల్లు త్రిమూర్తులు, తలారి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిదోవ రోజుకు చేరుకున్న సత్యసాయి తాగునీరు కార్మికుల సమ్మె




**రాజమహేంద్రవరం,జూన్22.అక్షర టైమ్స్ :** రాజమహేంద్రవరం గ్రామీణ నీటి సరఫరా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నందు కొనసాగుతున్న శ్రీ సత్య సాయి త్రాగునీటి పథకం కార్మికులు సమ్మె కొనసాగించడం సాధించడం జరుగుతుంది. ఎనిమిది రోజులు గడుస్తున్న కాంట్రాక్టర్ టీ వి వి సత్యనారాయణ స్పందించకపోవడం దారుణమని కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులు లేటవుతుంద అనే కారణంతో కాంట్రాక్టర్ మెయింటినెన్స్ చేయకపోవడం వల్ల ప్రాజెక్టు నిర్వీర్యం అయిందని అలాంటి కాంట్రాక్టర్ ని బ్లాక్ లిస్టులో పెట్టాలని కార్మికుల డిమాండ్ చేశారు. ఏడు నెల జీతాలు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోవడం వల్ల ఆరోగ్య భీమా కోల్పోతున్నామని వాపోయారు. ఈ పథకానికి ాడవీ ఆపరేషన్ అండ్ మెయిన్టనెన్స్ సపరేట్ చేసి నెల నెలా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు. ఆప్కోస్ ద్వారా అయినా నెల నెలా జీతాలు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరుచున్నారు, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. తూర్పు సత్య సాయి ప్రాజెక్ట్ పై సవతి ప్రేమ చూపిస్తున్నారని మిగతా జిల్లాల ప్రాజెక్టులకు విడుదల చేస్తున్న నిధులు ఆర్థిక శాఖ మంత్రి , తూర్పుగోదావరి జిల్లాకు నిధులు విడుదల చేయట్లేదని దానివల్ల మరింత దారుణమైన పరిస్థితిలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం పరిచారు. శ్రీ సత్యసాయి తాగునీటి పథకానికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ నిర్ణయం తీసుకోవాలని కార్మికుల కోరారు. కాంట్రాక్టర్ల దోపిడీ నుంచి తప్పించి ప్రభుత్వమే నిర్వహించేలా వికాస ద్వారా జీతాలను చెల్లించేలా చూడాలని ఎన్డీఏ ఓటమి ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నారు. మొన్న మాట మంతి కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రులు అయినటువంటి పవన్ కళ్యాణ్కు కార్మికుల గోడు వినపడలేదా, కనబడలేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## గాదరాడలో వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

**ప్రారంభించిన రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ**

**జూన్ 25 నుంచి ఓం శివశక్తి పీఠం - శంబాల నగరంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు**





**కోరుకొండ,జూన్22.అక్షర టైమ్స్ :** కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలోని 'ఓం శివశక్తి పీఠం - శంబాల నగరం'లో నూతనంగా నిర్మించిన ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా సోమవారం దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిభావం ఉట్టిపడేలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ నెల 25-06-2026 నుండి శంబాల నగరంలో నూతనంగా నిర్మించిన శ్రీ వారాహిదేవి అమ్మవారు, శ్రీ చండికాదేవి అమ్మవారు, శ్రీ సదాశివ మూర్తి, శ్రీ రాజశ్యామల అమ్మవారు, 10 దశమహావిద్యల అమ్మవార్లు, 7 సప్తమాతృకల అమ్మవార్లు, శ్రీ మానసాదేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి, శ్రీ ప్రత్యంగిరాదేవి, శ్రీ రాధాకృష్ణులు, 36 అడుగుల భారీ శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారు, 36 అడుగుల శ్రీ కాలభైరవ స్వామి వారు, బ్రహ్మ, విష్ణు మరియు అష్టదిక్పాలకులు మొదలగు 36 ఆలయాల విగ్రహ ప్రతిష్ట మరియు మహాకుంభాభిషేక మహోత్సవాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్నాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన మరియు కుంభాభిషేక మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రియుడి మోజులో కన్నకొడుకే బలి..

**రెండేళ్ల చిన్నారి హత్య కేసు ఛేదించిన కీసర పోలీసులు**



**కీసర,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** మేడ్చల్--మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో సంచలనం సృష్టించిన రెండేళ్ల బాలుడు హత్య కేసును పోలీసులు ఛేదించారు. కన్నతల్లి, ఆమె ప్రియుడు కలిసి బాలుడిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలడంతో ఇద్దరినీ అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, మేడ్చల్ జిల్లా చిర్యాల గ్రామంలోని ఈడెన్ గార్డెన్స్‌కు చెందిన రంగా హరికృష్ణ (2) మే 29న అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. బాలుడు ఇంట్లో పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడని తల్లి రంగా జ్యోతి కుటుంబ సభ్యులకు చెప్పింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే బాలుడి తండ్రి రంగా స్వామికి ఘటనపై అనుమానం కలగడంతో జూన్ 13న కీసర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనను అన్ని కోణాల్లో విచారించారు. సీసీటీవీ దృశ్యాలు, కాల్ డేటా, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించగా రంగా జ్యోతి, మొగిళ్ల నవీన్ మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు గుర్తించారు. ఘటన జరిగిన రోజు నవీన్ ఇంటికి వచ్చినట్లు, బాలుడిని ఆసుపత్రికి తరలించే సమయంలో కూడా అతడు ఉన్నట్లు ఆధారాలు లభించాయి. దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు జూన్ 19న బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించారు. విచారణలో తమ అక్రమ సంబంధానికి బాలుడు అడ్డుగా మారుతున్నాడని భావించిన జ్యోతి, నవీన్ ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. నవీన్ బాలుడిని నేలపై బలంగా కొట్టగా, జ్యోతి సహకరించినట్లు వెల్లడైంది. అనంతరం జరిగిన దారుణాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు బాలుడిని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. తల్లి ప్రేమకు ప్రతిరూపంగా ఉండాల్సిన కన్నతల్లే ప్రియుడి మోజులో పడి తన కుమారుడి ప్రాణాలు తీయడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన రంగా జ్యోతి, మొగిళ్ల నవీన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల కోసం ఎదురుచూస్తున్న పోలీసులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

## వేతనాలు పెంచండి - సిబ్బందిని పర్మినెంట్ చేయండి - ప్రభుత్వానికి వినతి





**మేడ్చల్ మల్కాజ్గిరి,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించి తమ సమస్యల పరిష్కారాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జే. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 వేల మంది మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నప్పటికీ శాశ్వతీకరణ, కనీస వేతనాలు, పదోన్నతులు వంటి హక్కులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన లేదా మరణించిన కార్మికులకు తగిన నష్టపరిహారం, వైద్య భద్రత కల్పించడం లేదని విమర్శించారు. రెండో పీఆర్సీలో కనీస వేతనాన్ని రూ.26,000గా నిర్ణయించి అమలు చేయాలని, మున్సిపల్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, డీఏ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను వెంటనే చెల్లించాలని, మరణించిన కార్మికుల దహన సంస్కారాల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తండ్రి... బాధ్యతల భారాన్ని మౌనంగా మోసే మహోన్నత వ్యక్తి



కుటుంబం అనే వ్యవస్థకు తండ్రి ఒక బలమైన స్తంభం. తల్లి ప్రేమను పంచితే, తండ్రి కుటుంబానికి భద్రతను, భవిష్యత్తుకు భరోసాను అందిస్తాడు. ఆయన ప్రేమ ఎక్కువగా మాటల్లో కనిపించకపోయినా, ప్రతి బాధ్యతలో, ప్రతి త్యాగంలో, ప్రతి నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే తండ్రిని కుటుంబానికి వెన్నెముకగా అభివర్ణిస్తారు. ఒక తండ్రి బాధ్యత కేవలం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే కాదు. పిల్లలకు మంచి విద్యను అందించడం, వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడటం, మంచి చెడులను గుర్తించే వివేకాన్ని నేర్పించడం కూడా ఆయన ప్రధాన కర్తవ్యం. పిల్లలు జీవితంలో తప్పటడుగులు వేయకుండా మార్గనిర్దేశం చేస్తూ, కష్టసుఖాల్లో అండగా నిలుస్తాడు. పిల్లలు విజయం సాధిస్తే ఆనందపడతాడు, అపజయం ఎదురైతే ధైర్యం చెప్పి ముందుకు నడిపిస్తాడు. తండ్రి జీవితమంతా బాధ్యతలతో నిండిన ప్రయాణం. తన అవసరాలు, కోరికలు, కలలను పక్కనపెట్టి కుటుంబ సభ్యుల సంతోషానికే ప్రాధాన్యత ఇస్తాడు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కుటుంబం కోసం వాటిని మౌనంగా భరిస్తాడు. పిల్లల ముఖంలో చిరునవ్వు చూడటమే తనకు అతిపెద్ద ఆనందంగా భావిస్తాడు. తండ్రి కేవలం సంపాదించే వ్యక్తి కాదు; ఆయన ఒక గురువు, మార్గదర్శి, రక్షకుడు, ప్రేరణదాత. క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేయడం, సమాజంలో గౌరవంగా జీవించడం వంటి విలువలను తన జీవితం ద్వారా పిల్లలకు నేర్పిస్తాడు. ఒక మంచి తండ్రి తన పిల్లలకు ఆస్తులు మాత్రమే కాదు, మంచి సంస్కారం మరియు విలువలను కూడా వారసత్వంగా అందిస్తాడు. నేటి సమాజంలో తండ్రి పాత్ర మరింత విస్తరించింది. పిల్లల విద్య, ఆరోగ్యం, భావోద్వేగ వికాసం, సాంకేతిక ప్రపంచంలో సరైన మార్గనిర్దేశం చేయడం వంటి అనేక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించడంలో తండ్రి పాత్ర ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో జూన్ 22, ఆదివారం సందర్భంగా ఫాదర్స్ డేను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు తమ తండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ, బహుమతులు అందించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. పాఠశాలలు, సామాజిక సంస్థలు, వివిధ సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి తండ్రుల సేవలను కొనియాడాయి. కుటుంబ సభ్యులు కలిసి ఈ రోజును ఆనందంగా జరుపుకుంటూ తండ్రి ప్రేమ, బాధ్యతలు, త్యాగాల గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు. "తండ్రి తన జీవితాన్ని పుస్తకంలా చదివించడు... కానీ తన జీవితాన్నే ఒక పాఠంగా మార్చి పిల్లలకు చూపిస్తాడు. కుటుంబం కోసం తన కలలను త్యాగం చేసే మొదటి వ్యక్తి తండ్రి."

### ఫాదర్స్ డే సందేశం:

"తండ్రి చెమట చుక్కల్లో కుటుంబ భవిష్యత్తు దాగి ఉంటుంది. ఆయన ప్రేమ నిశ్శబ్దంగా ఉండొచ్చు, కానీ ఆయన త్యాగం జీవితాంతం గుర్తుండిపోతుంది."మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి గోపగాని పాండు.

## పేద కుటుంబాలకు అండగా కంబాల శ్రీనివాసరావు

**అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సహాయం,బియ్యం పంపిణీ**




**గోకవరం,జూన్22.అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం మండలం తంటికొండ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు పేద కుటుంబాలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం, బీజేపీ, బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సహాయం, బియ్యం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. తంటికొండ గ్రామానికి చెందిన షేక్ పోసియ్యకు ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే అదే గ్రామానికి చెందిన కాకర్ల అప్పారావు, పక్షవాతం (పెరాలసిస్) వ్యాధితో బాధపడుతున్నాడు. అతని భార్య అక్కమ్మ కుష్టి వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అలాగే తన్నీరు నారాయణ హార్ట్ ప్రాబ్లంతో బాధపడుతున్నాడు. తమకు సహాయం అందించాలని కుటుంబ సభ్యులు స్థానిక బీజేపీ నాయకులు ద్వారా అమెరికాలో ఉన్న కంబాల శ్రీనివాసరావుని కోరగా, స్పందించిన ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న మూడు కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం, 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని, రామసేన సభ్యులు బీజేపీ నాయకులు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వారు సోమవారం అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, నగదు బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకన్న దొర, పసల గణేష్, గన్ని రాజు, షెడ్రాక్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## రంప యర్రంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రోటీన్ అవగాహన సదస్సు నిర్వహణ





**గోకవరం,జూన్22.అక్షర టైమ్స్ :** ఐబీ గ్రూప్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో "భారత్ ప్రోటీన్ మిషన్" కార్యక్రమంలో భాగంగా ప్రోటీన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐబీ గ్రూప్ ప్రతినిధులు, ఉద్యోగులతో పాటు శ్రీ దశరథ రామ్ పౌల్ట్రీ ఫార్మ్(ఈసీ ) యజమాని పాటి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు ప్రోటీన్ సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో ప్రోటీన్ల పాత్ర, పోషకాహార లోపాలను నివారించడంలో వాటి అవసరం గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా బ్రాయిలర్ చికెన్‌లో లభించే నాణ్యమైన ప్రోటీన్లు, విటమిన్లు మరియు ఖనిజాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అనంతరం తల్లిదండ్రులు, గ్రామస్థులకు రోస్టెడ్ చికెన్‌ను పంపిణీ చేసి ప్రోటీన్ ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అలాగే ఐబీ గ్రూప్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ బహదూర్ అలీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఐబీ గ్రూప్ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

**హాస్టల్‌లో ఆహార నిల్వల తనిఖీ**




**కీసర,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** విద్యార్థులు,చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహార ధాన్యాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు బోగారంలోని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ (బాయ్స్ హాస్టల్)తో పాటు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్ ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్ (ఇుజ) మేనేజర్ ఎం.ఏ. రషీద్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యత, నిల్వల నిర్వహణ, గోదాముల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించింది. బియ్యం సంచుల నుంచి నమూనాలను సేకరించి తేమ శాతం, గింజల నాణ్యత, కల్తీ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సరఫరాలు, నిల్వ విధానం, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. రికార్డులు, స్టాక్ వివరాలను తనిఖీ చేసి సరఫరాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ఆహార ధాన్యాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సరఫరాలు లబ్ధిదారులకు నాణ్యంగా చేరేలా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



అక్షర టైమ్స్

# అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలే బాట!

## సొంత ఖర్చుతో డ్రైనేజీ సమస్య పరిష్కరించుకున్న ఇంద్రమ్మ కాలనీ వాసులు

**అమీన్‌పూర్,జూన్23.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోని సమస్యను ప్రజలే పూనుకుని పరిష్కరించుకున్న ఘటన అమీన్‌పూర్ పరిధిలోని నర్రేగూడెం ఇంద్రమ్మ కాలనీలో వెలుగుచూసింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి, మురుగునీరు రోడ్లపై పారుతున్నా అధికారులు స్పందించకపోవడంతో, విసిగిపోయిన కాలనీవాసులు తమ సొంత డబ్బుతో సమస్యను పరిష్కరించుకున్నారు.




### నరకప్రాయంగా మారిన జీవనం

గత కొంతకాలంగా ఇంద్రమ్మ కాలనీలో డ్రైనేజీ పైపులైన్లు పూర్తిగా పాడైపోయాయి. దీనివల్ల మురుగునీరు రోడ్లపై నిలిచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దోమల బెడద పెరిగి అంటువ్యాధులు వ్యాపిస్తాయని ఆందోళన చెందారు. పలుమార్లు అధికారులకు, స్థానిక నాయకులకు విన్నవించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపించారు.

### అధికారుల నిర్లక్ష్యంపై నిరసన

తమ గోడును ఎవరూ వినిపించుకోకపోవడంతో, ఇంక వేచి చూడటం వల్ల లాభం లేదని భావించిన కాలనీ ప్రజలు ఏకతాటిపైకి వచ్చారు. ప్రజా ప్రతినిధుల కోసం, అధికారుల నిధుల కోసం ఎదురుచూడకుండా తామే రంగంలోకి దిగారు. చందాలు వేసుకుని, సుమారు రూ. 2 లక్షల వరకు సొంత డబ్బును సమకూర్చుకున్నారు. ఈ నిధులతో కొత్త డ్రైనేజీ పైపులైన్లను ఏర్పాటు చేసుకుని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకున్నారు.



### ప్రశ్నిస్తున్న స్థానికులు

"ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నా మా సమస్యలు తీరడం లేదు. కనీస సౌకర్యాల కోసం కూడా మేమే సొంత డబ్బు ఖర్చు చేసుకోవాలా?" అని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.అధికారుల వైఫల్యాన్ని ఎండగడుతూ, ప్రజల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.

# ప్రగతి పథంలో కాకినాడ సిటీ

## రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి,సుపరిపాలన

## శాసనసభ్యులు వనమాడి కొండబాబు

**కాకినాడ,జూన్22.అక్షర టైమ్స్ :** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతో కాకినాడ సిటీ నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తుందని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో, మౌలిక సదుపాయాల విస్తరణకు నిదర్శనంగా మారుతోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో కాకినాడ నియోజకవర్గం నందు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యారంగ బలోపేతం, పరిశ్రమల విస్తరణ, పర్యాటకాభివృద్ధి వంటి చర్యలు కాకినాడ ముఖచిత్రాన్ని మార్చే దిశగా సాగుతున్నాయిని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.స్థానిక సూర్య కళామందిరం నందు సోమవారం అదనపు కమిషనర్ కేపీ సుధాకర్ అధ్యక్షతన రాష్ట్రంలో రెండేళ్ల పాలనపై నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు.శాసనమండలి సభ్యులు పేరా బత్తుల రాజశేఖరం, మాజీ మంత్రివర్యులు చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ పరిశీలకులు పేచెట్టి చంద్రమౌళి, జనసేన నాయకులు అడబాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, వివిధ శాఖల నుంచి విచ్చేసిన అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయిని,విద్యార్థుల తల్లులకు ఆర్థిక అండగా నిలిచిన తల్లికి వందనం పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ది చేకూరిందని, మహిళల సాధికారతకు



చిహ్నంగా నిలిచిన "స్త్రీ శక్తి" పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా మహిళలపై ప్రయాణ భారం గణనీయంగా తగ్గిందిని, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజన సదుపాయం, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడ్డాయిని, సామాజిక భద్రతకు ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లక్షలాది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆధారంగా నిలిచాయిని, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు, మైనార్టీ మత పెద్దలకు గౌరవ వేతనాలు, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ వంటి చర్యలు వృత్తి ఆధారిత వర్గాల అభ్యున్నతికి తోడ్పడ్డాయిని, పేదరిక నిర్మూలన ప్రణాళిక (పీ4) ద్వారా అత్యంత వెనుకబడిన కుటుంబాలను గుర్తించి ప్రత్యేకంగా ఆదుకునే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, బంగారు కుటుంబాల గుర్తింపు, మార్గదర్శకుల నియామకం, ఆర్థిక సహాయం వంటి చర్యల ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాలను అభివృద్ధి ప్రవాహంలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, గృహ



నిర్మాణ పథకాల ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేరుతోందని, ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు వెచ్చించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడం జరుగుతుందని, పారిశ్రామిక అభివృద్ధి కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దడం జరుగుతుందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన, ఎంఎస్ఎంఇ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం, కొత్త పెట్టుబడుల ఆకర్షణ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి అని, విద్యా రంగ బలోపేతానికి ప్రాధాన్యతనిస్తూ మెగా డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయుల నియామకం, విద్యార్థులకు ఉచిత విద్యా కిట్లు పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాహారం అందిస్తూ, విద్యా నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి నారాయణరావు, బచ్చు శేఖర్, పలివెల రవి అనంత కుమార్, మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత రమేష్, పంతాడి రాజు, ఎస్కె రహీమ్, మెంటారావు, ఎన్డిఎ కూటమి శ్రేణులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం తప్పని తిప్పలు - పట్టించుకోని అధికారులు



**అమీన్‌పూర్,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** అమీన్‌పూర్ మండల పరిధిలోని నరేగూడెం ఇంద్రమ్మ కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కాలనీ ఏర్పడి ఇన్నేళ్లవుతున్నా కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోవడంతో పాటు, తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చడంతో ఇక్కడి ప్రజల జీవనం నరకప్రాయంగా మారింది.

### రోడ్లపైనే మురుగు నీరు.. అంటువ్యాధుల భయం

కాలనీలో డ్రైనేజీ కాల్వలు సక్రమంగా లేకపోవడం, ఉన్నవాటిని సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇండ్ల ముందు నుంచే మురుగు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి పిల్లలు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. కాలనీ రోడ్లపై నడవాలంటేనే ప్రజలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

### చుక్క నీటి కోసం చుక్కలు చూస్తున్న జనం



ఇక తాగునీటి సమస్య కాలనీని మరింత వేధిస్తోంది. ప్రతిరోజూ వంటకు, తాగడానికి నీరు దొరక్క కాలనీ మహిళలు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాలకు అసలు నీటి సరఫరానే జరగడం లేదని, మరికొన్ని చోట్ల అరకొరగా వస్తున్న నీరు కూడా కలుషితమై వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేయలేక పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం

ఈ సమస్యలపై స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఓట్ల కోసం వచ్చే నాయకులు, గెలిచిన తర్వాత తమ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని మండిపడుతున్నారు.

### ఇప్పటికైనా స్పందించండి!

"నరేగూడెం ఇంద్రమ్మ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఉన్నతాధికారులు తక్షణమే పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపాలి. లేనిపక్షంలో కాలనీవాసులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతాం" అని కాలనీ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'జనతా వారధి'

## ఆర్డీవోకు బీజేపీ నేతలు వినతి పత్రం

**కావలి,జూన్22.అక్షర టైమ్స్ :** ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న ఆయా రకాల సమస్యలు, భూ వివాదాలు తక్షణమే పరిష్కరించాలని బిజెపి నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎలీషా కి వినతి పత్రం సమర్పించారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమంలో భాగంగా, కావలి ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన 'ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ, భూ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అల్లూరు మండలం పురిని గ్ర గ్రామానికి చెందిన రైతు సుధాకర్ భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలనీ, వింజమూరు మండలానికి చెందిన గోసు సుజాత భర్త బిక్షమయ్య కుటుంబానికి చెందిన భూమిని, అదే కుటుంబానికి చెందిన కొందరు వ్యక్తులు అడంగల్‌లో పేర్లు మార్చి అక్రమాలకు



పాల్పడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి అని, దగదర్తి మండలం కౌరగుంట గ్రామానికి చెందిన భూ వివాదానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. కావలి డివిజన్ పరిధిలో యూరియా కొరతపై అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులతో చర్చించగా, ప్రస్తుతానికి ఎక్కడా యూరియా కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని తెలిపారు. కావలి హౌసింగ్ విభాగంలో గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయని, దీనిపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన



అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్, జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు మరియు కావలి డివిజన్ జనతా వారధి ఇంచార్జ్ కుట్టుబోయిన బ్రహ్మానందం, జిల్లా కోశాధికారి సి వి సి సత్యం, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపోతుల సాయికృష్ణ, పట్టణ కార్యదర్శి శ్రీనిక్ కుమార్ జైన్, యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుల రాజకీయాలు చేయడం చంద్రబాబు నైజం వైసీపీ నేతలు

**కాకినాడ,జూన్22.అక్షర టైమ్స్ :** కుల రాజకీయం చేసి లబ్ధి పొందడం చంద్రబాబు నైజమని వైసీపీ నేతలు విమర్శించారు.సోమవారం జిల్లా వైసీపీ కార్యాలయంలో కన్నబాబు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత మీడియాతో మాట్లాడారు. విజయవాడకు చెందిన సాయి కృష్ణను జగన్ పరామర్శిస్తే తప్పుడు ప్రచారం చేశారని.. మరి 24 గంటలు తిరగక ముందే సాయికృష్ణ కుటుంబ సభ్యులతో చంద్రబాబు భేటీ అయ్యారని చెప్పారు. కాపులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు.




# రేపటి 'ఆత్మీయ సమ్మేళనం' విజయవంతం చేద్దాం

## ఎండీ అలావుద్దీన్ పటేల్ పిలుపు

## మియాపూర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం






**శేర్లింగంపల్లి,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** మియాపూర్ డివిజన్ పరిధిలోని భారత్ రాష్ట్ర సమితి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు సభ్యుల 'ఆత్మీయ సమ్మేళన సమావేశం', అలాగే నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది ఎండీ అలావుద్దీన్ పటేల్ ఒక ప్రకటనలో స్పందిస్తూ.. రేపటి సమావేశానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు."రేపటి ఆత్మీయ సమ్మేళనంలో మన పార్టీ సభ్యులందరినీ ఒకే వేదికపై కలుసుకోబోతుండటం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలవడానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి, భవిష్యత్తు కార్యాచరణకు ఈ సమావేశం ఎంతో కీలకమని, మియాపూర్ పరిధిలోని పార్టీ శ్రేణులు, అభిమానులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని, సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అలావుద్దీన్ పటేల్ పిలుపునిచ్చారు.

# రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గోకవరం,జూన్22.అక్షర టైమ్స్ :** గోకవరం మండలం తంటికొండ గ్రామంలో నూతనంగా రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది.ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. రాధాకృష్ణులను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. మూడు రోజులుగా నిత్యం పూజలు హోమాలు ఇక్కడ నిర్వహించబడినవి. పూజా కార్యక్రమంలో భాగంగా పీటలపై కూర్చున్న టిడిపి మండల నాయకులు దాసరి సీతారామకృష్ణ దంపతులకు , బద్దిరెడ్డి శ్రీకృష్ణ దంపతులకు , బద్దిరెడ్డి కార్తీక్ దంపతులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన ఆశీస్సులు అందించారు. శ్రీకృష్ణ మందిర కమిటీ ఆధ్వర్యంలో రాధ, కృష్ణ విగ్రహాలు ,వినాయక విగ్రహం , లక్ష్మీదేవి విగ్రహం ప్రతిష్ఠ ఉదయం 9 గంటలకు ఆలయ కమిటీ సమక్షంలో గ్రామస్తుల సహకారం ఎంత ఘనంగా జరిగింది. గణపతి పూజ, పుణ్యవహచన ,రక్షాబంధన , పరిషత్ప్ర ప్రాయశ్చిత్తం , పంచగవ్య ప్రధాన,యాగశాల ప్రవేశం , మడప ఆవాహన, ఆరాధన,అగ్ని మథనం, సర్వతోభద్ర మండప దేవత ఆరాధన హోమాలు ఎంతో విశిష్టంగా నిర్వహించారు.విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గొప్ప అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట టిడిపి మండల కన్వీనర్ పోతుల మోహన్ రావు, గోకవరం మండలం కన్వీనర్ పిల్ల అర్జున సారది (చంటిబాబు), తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, క్లస్టర్ 1 ఇంచార్జ్ బద్దిరెడ్డి బాబి, మండల ప్రధాన కార్యదర్శి భరత్ మలిరెడ్డి సిరి, బద్దిరెడ్డి రవి, మండిగ గంగాధర్, నాగం వెంకటపతి, పెద్దాడ వెంకన్న దొర, ఎస్ బాబు, కర్రి బండి విష్ణు తదితరులు పాల్గొన్నారు.





# బాలికపై అత్యాచారం - నిందితుడి అరెస్ట్



**కాకినాడ,జూన్22.అక్షర టైమ్స్ :** యానాంకు చెందిన కట్టా నవీన్ కుమార్ ఈ నెల 16వ తేదీన కాకినాడ 1 టౌన్కు చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు అందిందని సీఐ నాగదుర్గారావు తెలిపారు. దీనిపై అదే రోజు పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సోమవారం నిందితుడ్ని అదుపులో తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ శిక్షణా కార్యక్రమం విజయవంతం

## నారాయణ్ అమిత్, భారత పరిపాలనా సేవ (ఐఏఎస్) ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి/మండల కమిషనర్,శేరిలింగంపల్లి మండలం

**శేర్లింగంపల్లి,జూన్22.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న :** రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని 052 - శేరిలింగంపల్లి శాసనసభ నియోజకవర్గానికి చెందిన అన్ని పోలింగ్ కేంద్రాల స్థాయి ప్రతినిధులు మరియు పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారుల కొరకు 'ప్రత్యేక సమగ్ర సవరణ - 2026' పై సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితా సవరణ విధానాలు, క్షేత్ర స్థాయి బాధ్యతలు, ఖచ్చితమైన, పారదర్శకమైన, సమ్మిళిత ఓటరు జాబితాల తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల భాగస్వాములు చురుకుగా పాల్గొని నిర్మాణాత్మకంగా చర్చించారని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నారాయణ్ అమిత్ వివరించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో సహాయక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు / ఉప కమిషనర్లు, ఆల్విన్ సర్కిల్, మాదాపూర్ సర్కిల్, మియాపూర్ సర్కిల్ అలాగే శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్లు మరియు సహాయక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పాల్గొన్నారు.





# పేదల ఆకలి తీర్చే ప్రయత్నంలో ప్రజలు భాగస్వాములు కావాలి





**పెదకూరపాడు,జూన్22.అక్షర టైమ్స్ :** పేదల ఆకలి తీర్చే ప్రయత్నంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ఆహారం వృధా చేయకండి మిగిలిన ఆహారంతో అన్నార్తులను ఆదుకుందామని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్ నూతన గృహప్రవేశ ఫంక్షన్లో, మండలంలోని లింగంగుంట్లకు చెందిన ఎలమంచిలి బ్రహ్మతేజ, రేణుక వివాహ రిసెప్షన్లో ఆహారం మిగిలి ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆహారాన్ని సేకరించి పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు శాంతికాలని, అమరావతిలోని చెంచు కాలనీలో సోమవారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఫంక్షన్ ఏదైనా ఆహారం మిగిలి ఉంటే 9885557987,8886777767 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని మిగిలిన ఆహారాన్ని వృధా కాకుండా పేదలకు పంచుతామని అన్నారు.ఈకార్యక్రమంలో చెరుకూరి శ్రీనివాసరావు,జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, ప్రతినిధులు షేక్ సుభాని, కొర్రపాటి వెంకటేశ్వర్లు,షేక్ లియాఖత్ ఆలి,దాసరి కారుణ్యబాబు,గుడిపూడి అఖిల్,దాసరి విజయ్ బెన్ని బాబు తదితరులు పాల్గొన్నారు. ఇరుప్రాంతాలలో సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు జన చైతన్య సమితి ప్రతినిధులు తెలిపారు.

# యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలి

## సచివాలయం కార్యదర్శి నాగరాజు




**పొదలకూరు,జూన్22.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా పొదలకూరు మండలంలోని మొగళ్లూరు గ్రామంలో యోగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.మొగళ్లూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి నాగరాజు పర్యవేక్షించారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక చక్కటి పరిష్కార మార్గమని తెలిపారు.

**ఆరోగ్యానికి యోగా వరం**

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు యోగా ప్రాముఖ్యతను వివరించారు.యోగా వల్ల శరీర దారుఢ్యం పెరగడంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలని సూచించారు.

**పలు యోగా ఆసనాల ప్రదర్శన**

ఈ సందర్భంగా యోగా శిక్షకుల మార్గదర్శకత్వంలో పలు యోగా ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. పాల్గొన్న వారందరూ ఆసక్తిగా యోగా సాధన చేసి ఆరోగ్యకర జీవన విధానానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయ పడ్డారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది.ఈ కార్యక్రమంలో విఆర్ఓ కే. రాజా, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్. కరుణతేజ్, మహిళా పోలీస్ ఆర్. అనిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్. మనోజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి:**

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యోగా భారతదేశానికి చెందిన గొప్ప సంప్రదాయమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని పిలుపునిచ్చారు.

# గంజాయి డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ కస్తాల గోపికృష్ణ




**పెన్ పహాడ్,జూన్22.అక్షర టైమ్స్ :** లింగాల గ్రామం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించిన పెనపహాడ్ ఎస్ ఐ కస్తాల గోపికృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం జూన్ 26 సందర్భంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు పెనపహాడ్ మండలం లింగాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి డ్రగ్స్ నిర్మూలన, గంజాయి నిర్మూలన పట్ల విద్యార్థులను చైతన్యవంతం చేశాం అని ఎస్ఐ తెలిపినారు. మాదకద్రవ్యాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా మండల పరిధిలో వారం రోజులపాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసే వ్యసనాల బారిన పడకూడదని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా లేదా రవాణా చేసినా చట్టపరంగా ఎదురయ్యే కఠినమైన శిక్షలను హెచ్చరించారు. విద్యార్థులు కేవలం చదువు, క్రీడలపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100, 112 కు, 1908 కి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడుతాయని తెలిపారు. మత్తుపదార్థాల రహిత సమాజ స్థాపనకు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ప్రత్యేక ఆకర్షణగా యాంటీ డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ స్టిక్.. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ స్టిక్ ను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు మేము సైతం మాదాకద్రవ్యాల నిర్మూలన సైనికులుగా ఉంటామని సెల్ఫీ స్టిక్ వద్ద ఫోటోలు దిగి పేర్లు నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (ఎవీ), ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీ-సర్వేలో గందరగోళం - రైతుల భూములు గల్లంతు

## నందవరం మండలంలో రైతుల ఆగ్రహ జ్వాలలు..

## అవకతవకలతో రైతులకు నష్టం..

## రుణాలు,భరోసా పథకాలకు దూరంగా రైతులు



**ఎమ్మిగనూరు/రూరల్,జూన్ 22.అక్షర టైమ్స్ :** వ్యవసాయం ఆధారంగా జీవిస్తున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో భూమి హక్కుల స్పష్టత అత్యంత కీలకం. అలాంటి సమయంలో రీ-సర్వేలో చోటుచేసుకున్న లోపాలు రైతుల జీవనోపాధిని నేరుగా దెబ్బతీస్తున్నాయి. సమస్యలపై తక్షణ స్పందన లేకపోతే, ఇది పెద్ద ఎత్తున రైతు ఉద్యమానికి దారితీసే అవకాశమున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. భూమి రికార్డుల సవరణ పేరుతో చేపట్టిన రీ-సర్వే కార్యక్రమం నందవరం మండలంలో రైతులకు వరంగా కాకుండా శాపంగా మారుతోంది. భూసమస్యలను పరిష్కరించాల్సిన ఈ ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలు రైతులను ఆర్థికంగా, పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం నాడు అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ అబ్దుల్ వహాబ్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి సత్తన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాలను తీవ్రంగా విమర్శించారు.

**భూముల నమోదు లో గందరగోళం:**

గ్రామాల్లో తక్కువ భూమి ఉన్న రైతులకు ఎక్కువగా, ఎక్కువ భూమి ఉన్న వారికి తక్కువగా నమోదు చేయడం వంటి విరుద్ధ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దశాబ్దాల క్రితం అమ్ముకున్న భూములను మళ్లీ ప్రస్తుత యజమానుల పేర్లలో నమోదు చేయడం రైతుల హక్కులను ప్రశ్నార్థకంగా మార్చిందని ఆయన అన్నారు.

**జాయింట్ ఖాతాలు - రైతులకు అడ్డంకులు:**

ఎల్ఎల్పీ నెంబర్లతో జాయింట్ ఖాతాలు నమోదు చేయడం వల్ల రైతులు బ్యాంకు రుణాలు పొందడంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ఎన్టీఆర్ రైతు భరోసా వంటి కీలక పథకాలు కూడా అందకుండా పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యం:**

రాష్ట్ర ప్రభుత్వం రీ-సర్వే లోపాలను సరిచేయాలని ఆదేశించినప్పటికీ, స్థానిక వీఆర్వోలు, సర్వేయర్ కార్యాలయాలు సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించకపోవడం రైతులలో అసహనాన్ని పెంచుతోంది.ఉద్యమానికి సిద్ధమవుతున్న రైతులు:ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రీ-సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలని రైతు కూలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే మండలంలోని రైతులను ఏకం చేసి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించే వరకు వెనుకాడబోమని వారు స్పష్టం చేశారు.

# కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి అండగా నిలుస్తాం

## రూ.18.5 లక్షలతో సౌచాలయాల ఏర్పాటు

## సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్



**గుంటూరు,జూన్22.అక్షర టైమ్స్ :** కేంద్రీయ విద్యాలయం ను ఆధునీకరించటానికి అన్నీ విధాలా అండగా నిలుస్తామని సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. సెంట్రల్ ట్యాక్స్ శాఖ స్వచ్ఛతా నిధులతో నల్లపాడు కేంద్రీయ విద్యాలయంలో సరికొత్త హంగులతో, అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన సౌచాలయాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ..స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా విద్యాలయంలో శిధిలావస్థ లో ఉన్న మరుగుదొడ్లు ను రూ. 18.5 లక్షల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో పూర్తి స్థాయి లో పునరుద్దరించామన్నారు. ఈ ప్రాజెక్టు లో భాగంగా పాఠశాలలో మూడు అంతస్తులలోని ఆరు బ్లాకులలో బాలురు, బాలికల కోసం అత్యాధునిక ప్రీమియం నాణ్యతతో నిర్మించడం జరిగిందన్నారు. అందరికీ సమాన హక్కు కల్పించే లక్ష్యంతో, దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేక సౌచాలయం నిర్మాణానికి ఈ ప్రాజెక్ట్ లో ప్రాధాన్యత ఇవ్వబడిందన్నారు. ఆధునిక పారిశుధ్య సౌకర్యాల వల్ల పాఠశాలలో పరిశుభ్రత మరియు మౌలిక వసతులు మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యాలయాలలో మౌలిక సౌకర్యాలను మెరుగు పరచడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత గా భావించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.ప్రిన్సిపాల్ బొంత శేఖర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత నిధులతో తమ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ కు కృతజ్ఞతలు తెలిపారు.తొలుత కమిషనర్ కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు, ఎన్.సి.సి క్యాడెట్లు, స్కౌట్ అండ్ గైడ్స్ ఘన స్వాగతం పలికారు.

# పొదలకూరులో ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆలయ 32వ వార్షికోత్సవ వేడుకలు



**పొదలకూరు, జూన్22.అక్షరటైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** పొదలకూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 32వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.వేడుకల సందర్భంగా ముందుగా గోపూజ నిర్వహించి, అనంతరం అమ్మవారికి అభిషేకాలు, సహస్రనామార్చన, ప్రత్యేక అర్చనలు, పుష్పాలంకరణ సేవలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు మారెళ్ళ నాగేశ్వరరావు స్వామి,చైతన్య స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరిగాయి.ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు.ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి పట్టణానికి చెందిన నున్నా శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి కటాక్షం ప్రజలందరిపై ఉండాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యాలు నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది.ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు వాకాటి రాఘవేంద్ర, తన్నీరు సురేష్‌బాబు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

## వైకుంఠపురం ప్రాంతంలో రూ.48 లక్షలతో పనులు

## ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే




**కావలి,జూన్22.అక్షర టైమ్స్ :** కావలి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం కావలి పట్టణంలోని వైకుంట పురం 38వ వార్డులో ఉన్న అనపగుంట ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, అనపగుంట కల్వర్టు త్వరలో ప్రారంభిం చబోయే పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వైకుంటపురం ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ముంపు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాంపల్లి కోర్టు సమన్లు

## విచారణకు హాజరు కాని అల్లుఅర్జున్

## నాంపల్లి కోర్టుకు హాజరుకావాలని అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

## షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరిన బన్నీ!

## అల్లు అర్జున్ మినహా నాంపల్లి కోర్టుకు హాజరైన నిందితులు



నాంపల్లి కోర్టుకు హాజరుకావాలని నటుడు అల్లు అర్జున్‌కు సమన్లు జారీ అయిన సంగతి తెలిసిందే. వ్యక్తిగతంగా హాజరు కావాలని 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేయగా, షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి అల్లు అర్జున్ మినహాయింపు కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అల్లుఅర్జున్ మినహా మిగతా నిందితులు నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. జడ్జి ముందు బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం నాంపల్లి కోర్టు విచారణను వచ్చే నెల 6వ తేదీకి వాయిదా వేసింది.ఈ కేసులో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను ఏ-11గా చేర్చారు. ఏ-1 నుంచి ఏ-10 వరకు సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని నిందితులుగా పేర్కొన్న పోలీసులు, ఇప్పటికే 23 మంది నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాట జరగగా, రేవతి అనే మహిళ మృతి చెందడంతో పాటు కుమారుడు శ్రీతేజ్‌కు తీవ్రగాయాలైన సంగతి తెలిసిందే. నిందితుల వ్యక్తిగత హాజరు తర్వాత ట్రయల్ ప్రారంభానికి నాంపల్లి కోర్టు సిద్ధమైంది.

# అమెరికాలో తెలంగాణ విద్యార్థి ఆకస్మిక మృతి

## ఫ్లోరిడాలో ఆకస్మిక అనారోగ్యంతో అరుణ్ సాయిరెడ్డి మృతి

## ఉన్నట్టుండి తీవ్ర అనారోగ్యానికి గురైన సాయిరెడ్డి

## మృతుడిది మహబూబ్‌నగర్ జిల్లా





ఉన్నత చదువులు చదివి, బంగారు భవిష్యత్తును వెతుక్కుంటూ అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన మరో యువ విద్యార్థి అక్కడ అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయిరెడ్డి బొల్లెందుల.. ఫ్లోరిడాలో ఆకస్మికంగా సంభవించిన తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశాడు. ఈ విషాద వార్తతో ఆయన స్వగ్రామంలో ఒక్కసారిగా తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.అరుణ్ సాయిరెడ్డి హయ్యర్ స్టడీస్ కోసం యూఎస్ వెళ్లాడు. అక్కడ చదువు విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత.. ప్రస్తుతం ఫ్లోరిడా రాష్ట్రంలోని టెంపా నగరంలో నివసిస్తున్నాడు. అక్కడ స్టెమ్ ఓపీటీ (రెజువీ వ్రాు) కింద ఒక కంపెనీలో ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందుతూ లైఫ్‌లో సెటిల్ అయ్యే ప్రాసెస్‌లో ఉన్నాడు.ఈ నెల 19వ తేదీ వరకు స్నేహితులతో ఎంతో యాక్టివ్‌గా, హెల్తీగా గడిపిన అరుణ్ సాయిరెడ్డి.. ఆ తర్వాత ఉన్నట్లుండి తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాడు. రూమ్‌మేట్స్, ఫ్రెండ్స్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా అతడిని స్థానికంగా ఉన్న ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు.హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులో చేర్చుకున్న డాక్టర్ల బృందం అరుణ్‌ను కాపాడేందుకు అత్యవసర చికిత్స అందించింది. కానీ అప్పటికే పరిస్థితి పూర్తిగా విషమించడంతో ఆసుపత్రిలోనే కన్నుమూశాడు. 26 ఏళ్లకే కొడుకు శాశ్వతంగా దూరమయ్యాడనే వార్త వినడంతో ఇక్కడ ఉన్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అరుణ్ డెడ్ బాడీని తెలంగాణకు రప్పించేందుకు అక్కడి ప్రవాస తెలుగు సంఘాలు లీగల్ ప్రాసెస్ ప్రారంభించాయి.

# రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఏవో




**గోకవరం,జూన్22.అక్షర టైమ్స్ :** గోకవరం ఈరోజు నుండి 27/6/26 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సిబ్బంది ప్రతి రైతుని కలిసి ఎల్ నినో రాష్ట్ర వ్యవసాయం పై ప్రభావం తప్పించుకోవడానికి దీర్ఘ కాలిక విత్తనాలు కాకుండా తక్కువ పంట కాలం ఉండేవి నాటుకోవాలని ఏపీ ఎయిమ్స్ యాప్ 2.0 ద్వారా యూరియా డి ఏ పి ఎరువుల పంపిణీ గూర్చిన అవగాహన మరియు సిఫార్సు మేరకు మాత్రమే ఎరువుల వాడకం మరియు ప్రకృతి వ్యవసాయంలో పచ్చి రొట్ట విత్తనాలు అపరాలు నాటడం వల్లా భూ సారం కాపాడుకోవచ్చు అని క్రిష్ణునిపాలెం, కామరాజుపేట గ్రామాల్లో రైతులతో చర్చించడం జరిగింది.డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ నుండి ఏ డి ఏ. జయరామ లక్ష్మీ , కామరాజు పేట సొసైటీ చైర్మన్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. యూరియా డి ఏ పి ఎరువుల సరఫరా మొత్తం రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఆధార్ తో వెరిఫై చేసిన రైతులకు మాత్రమే సొసైటీలు ప్రైవేట్ దుకాణదారులు సరఫరా చేస్తారు అని తెలియచేయడం జరిగింది.



# పెరిగిన బంగారం, వెండి ధరలు

**జూన్ 22న తెలుగు రాష్ట్రాల్లో ఎంతంటే**

**పెరిగిన బంగారం, వెండి ధరలు**

**ఏపీ, తెలంగాణలో ధరలు ఎలా ఉన్నాయంటే**



దేశీయ మార్కెట్‌లో సోమవారం బంగారం ధరలు మరోసారి స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో జరుగుతున్న పరిణామాలు, డిమాండ్ పెరుగుదలతో పాటు పెట్టుబడిదారుల ఆసక్తి కారణంగా పసిడి ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి.క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం, సోమవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,50,270గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఈ ధర రూ.1,49,600గా ఉండగా, ఒక్కరోజులోనే రూ.670 మేర పెరుగుదల కనిపించింది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు, ముంబయి, బెంగళూరు మార్కెట్లలో కూడా ఇదే ధర కొనసాగుతోంది. నగల తయారీలో విస్తృతంగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా పెరిగింది. ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,34,040గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఈ ధర రూ.1,37,040గా ఉండగా స్వల్ప మార్పులు కనిపిస్తున్నాయి.బంగారం బాటలోనే వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,41,999గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో కిలో వెండి ధర రూ.2,37,190గా ఉండగా, ఒక్కరోజులోనే దాదాపు రూ.4,809 మేర పెరిగింది. పరిశ్రమల డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ఈ పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు కొన్ని కీలకమైన విషయాలను గుర్తుంచుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నాణ్యత గుర్తింపు, స్వచ్ఛతను లెక్కించే విధానం మరియు తుది బిల్లుపై అవగాహన ఉండటం ఎంతో అవసరం.

916 హాల్‌మార్క్ ప్రాధాన్యత

**ధ్రువీకరణ :** హాల్‌మార్క్ అనేది బంగారం స్వచ్ఛతకు ప్రభుత్వ పరంగా లభించే అధికారిక గ్యారంటీ.

**22 క్యారెట్ల గుర్తు:** మార్కెట్‌లో '916 హాల్‌మార్క్' ఉన్న బంగారాన్ని 22 క్యారెట్ల నాణ్యమైన ఆభరణంగా గుర్తిస్తారు.

**భవిష్యత్తు ప్రయోజనం :** హాల్‌మార్క్ నగలను కొనుగోలు చేయడం వల్ల మోసపోయే అవకాశం ఉండదు. అలాగే, భవిష్యత్తులో వాటిని తిరిగి విక్రయించినప్పుడు కూడా మంచి రీసేల్ విలువ లభిస్తుంది.

బంగారం స్వచ్ఛతను ఎలా లెక్కిస్తారు

బంగారం నాణ్యతను క్యారెట్లలో కొలుస్తారు. క్యారెట్ విలువ పెరిగేకొద్దీ స్వచ్ఛత పెరుగుతుంది. 24 క్యారెట్ల బంగారం : ఇది 99.9% అత్యంత స్వచ్ఛమైన బంగారం. అయితే, ఇది చాలా మెత్తగా ఉండటం వల్ల దీనితో నేరుగా ఆభరణాలను తయారు చేయలేరు. అందుకే దీనిని బంగారు నాణేలు, బిస్కెట్లు మరియు బార్ల రూపంలో పెట్టుబడుల కోసం ఉపయోగిస్తారు.

**22 క్యారెట్ల బంగారం :** ఆభరణాల తయారీకి 22 క్యారెట్ల బంగారాన్నే వాడతారు. ఈ బంగారానికి కొంత శాతం ఇతర

**తుది బిల్లును ప్రభావితం చేసే అంశాలు**

మార్కెట్‌లో రోజూ ప్రకటించే ధరలు కేవలం ప్రాథమిక బంగారం ధరలు మాత్రమే. వినియోగదారులు కొనేటప్పుడు చెల్లించే తుది బిల్లులో క్రింది అదనపు ఖర్చులు చేరతాయి.

**తయారీ కూలి :** నగల డిజైన్‌ను ఆధారంగా ఈ ఛార్జీలు ఉంటాయి.

**తరుగు :** నగలను తయారు చేసేటప్పుడు పోయే నష్టం.

**పన్నులు :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే జీఎస్‌టీ

**ఫీజులు :** హాల్‌మార్కింగ్ కోసం వసూలు చేసే నామమాత్రపు రుసుము.

తయారీ ఛార్జీలు, తరుగు రేట్లు అనేవి ప్రతి దుకాణంలో భిన్నంగా ఉంటాయి. అందుకే బిల్లును పూర్తిగా పరిశీలించిన తర్వాతే డబ్బులు చెల్లించాలి. అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల బంగారం, వెండి ధరలు రోజూ మారుతుంటాయి. కొనుగోలుకు వెళ్లే ముందు తాజా ధరలను సరిచూసుకోవాలి. ఎల్లప్పుడూ 916 హాల్‌మార్క్ ఆభరణాలనే ఎంచుకోవడం సురక్షితమైన నిర్ణయం.

# ఉద్యోగులను తొలగించి రోబోల నియామకం

**జనరల్ మోటార్స్‌పై కార్మిక సంఘాల ఫైర్**

**డెట్రాయిట్ ప్లాంట్‌లో వెయ్యికి పైగా ఉద్యోగాలకు జీఎం కోత**

**వారి స్థానంలో 50 కొత్త రోబోలను నియమించిన సంస్థ**

**కంపెనీ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కార్మిక సంఘాలు**

**పోటీతత్వం, భద్రత కోసమే ఈ చర్యలన్న జనరల్ మోటార్స్**




ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ (జీఎం) తీసుకున్న ఓ నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అమెరికాలోని డెట్రాయిట్‌లో ఉన్న తమ ప్రధాన అసెంబ్లీ ప్లాంట్‌లో వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో 50 కొత్త రోబోలను రంగంలోకి దించింది. మానవ కార్మికుల స్థానంలో యంత్రాలను నియమించడంపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.మిచిగాన్‌లోని 'ఫ్యాక్టరీ జీరో' ప్లాంట్‌లో ఈ కొత్త రోబోలను ప్రవేశపెట్టారు. వీటిని 'కోబోట్స్' (కొలాబరేటివ్ రోబోట్స్) అని పిలుస్తున్నారు. అసెంబ్లీ లైన్‌లో మిగిలిన సిబ్బందితో కలిసి ఇవి వాహనాల బాడీ ప్యానెల్స్‌ను అమర్చే పని చేస్తాయి. తమ కార్యకలాపాల్లో అధునాతన టెక్నాలజీని తీసుకురావడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని జీఎం ప్రతినిధి కెవిన్ కెల్లీ తెలిపారు. "పోటీలో నిలదొక్కుకోవడానికి, కార్మికుల భద్రత, పని సౌలభ్యం మెరుగుపరచడానికి ఈ కోబోట్‌లు అవసరం. మా బృందంతో కలిపి వీటిని వినియోగిస్తున్నాం" అని ఆయన వివరించారు.అయితే, జీఎం వాదనను యునైటెడ్ ఆటో వర్కర్స్ (యూఏడబ్ల్యూ) లోకల్ 22 యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇది పూర్తిగా ఉద్యోగుల పొట్టకొట్టడమేనని యూనియన్ అధ్యక్షుడు జేమ్స్ కాటన్ ఆరోపించారు. "వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తొలగించిన తర్వాత ప్లాంట్‌లోకి రోబోలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇదే భవిష్యత్తు అని కంపెనీ చెబుతోంది. అదే నిజమైతే వారు ప్రజల నుంచి ఉద్యోగాలను లాగేసుకుంటున్నారు" అని ఆయన అన్నారు. తమ ప్లాంట్లలో కోబోట్‌లను ఏర్పాటు చేయడం పట్ల తీవ్ర అసహనంతో ఉన్నామని కాటన్ స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే.. జనరల్ మోటార్స్ ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ఈ తొలగింపులు చేపట్టడం గమనార్హం. 2026 మొదటి త్రైమాసికంలో కంపెనీ ఏకంగా 4.25 బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జించింది. ఇది గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 22 శాతం అధికం కావడం విశేషం. ఇంత భారీ లాభాలు గడిస్తున్న సమయంలో ఉద్యోగులను తొలగించి రోబోలను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు ఆటోమేషన్‌తో భవిష్యత్తుకు సిద్ధమవుతున్నామని జీఎం చెబుతుండగా, మరోవైపు ఇది తమ ఉపాధిని దెబ్బతీస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చమురు దిగుమతుల్లో భారత్ దూకుడు

**మళ్లీ రష్యానే టాప్**

**అమెరికా నుంచి భారీగా తగ్గిన కొనుగోళ్లు**

**రష్యా, యూఏఈ నుంచి చమురు దిగుమతుల్ని భారీగా పెంచిన భారత్**

**ఇప్పటికీ అతిపెద్ద సరఫరాదారుగా రష్యానే- యూఏఈ నుంచి కూడా రికార్డు స్థాయిలో పెరిగిన చమురు కొనుగోళ్లు**



అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో హర్మూజ్ జలసంధి పూర్తి స్థాయిలో తిరిగి తెరుచుకుంటోంది. దీంతో ఇప్పటికే గల్ఫ్ దేశాల నుంచి చమురు సరఫరా జరుగుతోంది. చమురు రవాణాకు ప్రపంచవ్యాప్తంగా హర్మూజ్ జలసంధి కీలకంగా ఉంది. ఈ క్రమంలోనే హర్మూజ్ పూర్తి స్థాయిలో సాధారణ స్థితికి వచ్చే లోపే భారత్ చమురు సరఫరాను భారీగా పెంచుతోంది. తన ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. జూన్ నెలలో రష్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఖాజు) నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లను గణనీయంగా పెంచినట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి. గల్ఫ్ ప్రాంతంలో సరఫరా అంతరాయాల నేపథ్యంలో భారత రిఫైనరీలు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.మారిటైమ్ అండ్ కమొడిటీ ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ఈ గణాంకాల్ని వెల్లడించింది. జూన్ 1 నుంచి 19 వరకు భారత్ రోజుకు సగటున 26.6 లక్షల బ్యారెళ్ల రష్యా క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంది. మే నెలలో ఇది కేవలం 19.1 లక్షల బ్యారెళ్లుగానే ఉంది. జూన్‌లో ఈ లెక్కన భారీ స్థాయిలో పెరిగిందని చెప్పొచ్చు. దీంతో రష్యా మరోసారి భారతదేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది.యూఏఈ నుంచి కూడా భారత్ రోజుకు 6.36 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంది. మే నెలలో ఇక్కడ రికార్డు స్థాయిలో 6.44 లక్షల బ్యారెళ్లుగా ఉండగా ఇక్కడ కాస్త తగ్గిందని చెప్పొచ్చు. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఎక్కువేనని తెలుస్తోంది. ఇక వెనిజువెలా నుంచి రోజుకు 2.09 లక్షల బ్యారెళ్ల ముడి చమురు దిగుమతి కావడంతో ఈ దేశం భారత్‌కు నాలుగో అతిపెద్ద చమురు సరఫరాదారుగా అవతరించింది. సౌదీ అరేబియా రోజుకు 3.84 లక్షల బ్యారెళ్ల చమురును భారత్‌కు ఎగుమతి చేసి మూడో స్థానంలో ఉంది.

**అమెరికా నుంచి మరీ ఇలా ఏంటి**

ఇక్కడ రష్యా, యూఏఈ, సౌదీ అరేబియా, వెనిజువెలా నుంచి భారత్ చమురు రికార్డు స్థాయిలో దిగుమతి చేసుకోగా మరోవైపు అమెరికా నుంచి మాత్రం కొనుగోళ్లను తగ్గించింది. మే నెలలో అమెరికా నుంచి రోజుకు 2.52 లక్షల బ్యారెళ్ల చొప్పున ముడి చమురు దిగుమతి చేసుకోగా జూన్ నెలలో ఇది 91 వేల బ్యారెళ్లకు పడిపోయింది.ప్రపంచ చమురు వినియోగంలో దాదాపు 20 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా జరుగుతుంది. అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు మార్కెట్లలో తీవ్ర సంక్షోభం నెలకొంది. సౌదీ అరేబియా సహా కువైట్, ఇరాక్, ఖతార్, యూఏఈ తదితర గల్ఫ్ దేశాల నుంచి క్రూడ్ ఆయిల్ ఎగుమతులకు ప్రధాన మార్గం హర్మూజే కావడంతో సరఫరాలపై గణనీయ ప్రభావం పడింది. అమెరికా- ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత పరిస్థితి కాస్త మెరుగుపడ్డప్పటికీ పూర్తి స్థాయిలో సాధారణ స్థితికి చేరుకోలేదు.

**88 శాతం చమురు దిగుమతులపైనే**

ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్ మూడో అతిపెద్ద ఇంధన దిగుమతిదారుగా ఉంది. దేశీయ అవసరాల కోసం వినియోగించే ముడి చమురులో దాదాపు 88 శాతం, ఇంకా సహజ వాయువులో (నాచురల్ గ్యాస్) దాదాపు 50 శాతం, ఎల్పీజీలో 65 శాతం వరకు భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. హర్మూజ్ సంక్షోభానికి ముందు చూస్తే గల్ఫ్ దేశాల నుంచే భారత్‌కు సగం వరకు చమురు, మూడింటి రెండొంతుల మేర ఎల్ఎన్‌జీ, దాదాపు 90 శాతం ఎల్పీజీ సరఫరా అయ్యేది. దీంతో గల్ఫ్ ప్రాంతంలో ఏ చిన్న ఉద్రిక్తతలు నెలకొన్నా భారత్‌పై భారీగా ప్రభావం పడుతుంది.ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత ఇతర చాలా దేశాల నుంచి ఆంక్షల కారణంగా రష్యా తన చమురును డిస్కౌంట్‌లో విక్రయిస్తోంది. భారత్ ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంది. తక్కువ ధరకు లభించడం సహా నిరంతర సరఫరా అందుబాటులో ఉండటంతో రష్యా నుంచి భారత్ దిగుమతుల్ని భారీగా పెంచుకుంది. కెప్లర్ సీనియర్ మేనేజర్ సుమిత్ రిటోలియా ప్రకారం జూన్ నెలలో రష్యా నుంచి చమురు దిగుమతులు రోజుకు 23.5 లక్షల బ్యారెళ్లను దాటే అవకాశం ఉంది.

# హర్మూజ్ జలసంధి బంద్

**మళ్లీ ఎగబాకిన చమురు ధరలు**

**జలసంధిని మళ్లీ మూసేసిన ఇరాన్**

**ఆసియా ట్రేడింగ్‌లో భారీగా పెరిగిన చమురు ధరలు**

**కాల్పుల విరమణను అమెరికా, ఇజ్రాయెల్ ఉల్లంఘించాయన్న ఐఆర్‌జీసీ**

**ఒక్క రోజులో 26 నుంచి 5కు పడిపోయిన జలసంధి గుండా వెళ్లే నౌకల సంఖ్య**



అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'ని ఇరాన్ తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సోమవారం ఉదయం ఆరంభమైన ఆసియా మార్కెట్ ట్రేడింగ్‌లో ముడిచమురు ధరలు నింగిని తాకాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన 'బ్రెంట్ క్రూడ్' ఫ్యూచర్స్ సుమారు 1.24 శాతం మేర పెరిగి బ్యారెల్‌కు 81.04 డాలర్ల (గరిష్టంగా82.30 డాలర్లు)కు చేరుకోగా, అమెరికాకు చెందిన డబ్ల్యూటీఐ క్రూడ్ ఏకంగా 2.53 శాతం పెరిగి 77.77 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న స్విట్జర్లాండ్ శాంతి చర్చల ప్రక్రియపై ఈ పరిణామం తీవ్రమైన అనిశ్చితిని, నీలినీడలను కమ్మేలా చేసింది.లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు జరుపుతున్న దాడులను అమెరికా అండతో సాగుతున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలుగా ఇరాన్ పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ సైనిక విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (ఐఆర్‌జీసీ) జలసంధిని పూర్తిగా మూసివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోంది. అంతకుముందు రోజు శనివారం ఈ జలసంధి గుండా 26 వాణిజ్య నౌకలు ప్రయాణించగా, ఆదివారం నాటికి ఆ సంఖ్య కేవలం 5 నౌకలకే పడిపోయినట్లు అంతర్జాతీయ షిప్పింగ్ డేటా వెల్లడించింది. ప్రపంచవ్యాప్త ముడిచమురు వినియోగంలో ఐదో వంతు వాటా ఒక్క హర్మూజ్ జలసంధి నుంచే సరఫరా అవుతుండటం, దీనికి తోడు భారీగా ఎల్ఎన్‌జీ గ్యాస్ ఎగుమతులు కూడా ఇక్కడి నుంచే జరుగుతుండటంతో ఈ ప్రాంతంలో చిన్న అంతరాయం ఏర్పడినా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది.గత ఏప్రిల్ నెలలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో 60 రోజుల పాటు పొడిగించి, మరింత విస్తృతమైన దౌత్య చర్చలు జరపాలని భావించిన తరుణంలో ఈ సంక్షోభం ముదిరింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆదివారం ఇరాన్ ఉన్నతాధికారులతో నేరుగా ప్రాథమిక చర్చలు జరిపారు. మరోవైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం చర్చలు విఫలమైతే ఇరాన్‌పై తిరిగి కఠినమైన సైనిక చర్యలు ఉంటాయని హెచ్చరించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. నౌకలు తమ ట్రాన్స్‌పాండర్లను ఆఫ్ చేసి ప్రయాణించే అవకాశం ఉన్నందున వాస్తవ రవాణా గణాంకాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. మార్కెట్ నిపుణులు మాత్రం రాబోయే రోజుల్లో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, తాజా అప్‌డేట్ల కోసం అంతర్జాతీయ ఫైనాన్షియల్ మార్కెట్లను నిశితంగా గమనించాలని సూచిస్తున్నారు.

# మీ దగ్గర "క్రెడిట్ కార్డు" ఉందా

**ఈ విషయాలు తెలుసుకోకపోతే అప్పుల్లోకే!**

**'క్రెడిట్ కార్డు' వాడుతున్నారా**

**వీటి గురించి తప్పక తెలుసుకోవాల్సిందే అంటున్న నిపుణులు!**

ప్రస్తుతం క్రెడిట్ కార్డుల వినియోగం పెరిగిపోయింది. ఒకరొకరు రెండు మూడేసి కార్డులను తీసుకుంటున్నారు. అయితే, వీటి వాడకంలో చాలా మందికి పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొన్ని మిస్టేక్స్ చేస్తున్నారు. దాంతో సక్రమంగా వాడనివారు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. అందుకే, క్రెడిట్ కార్డులు వాడుతున్నవారు వార్షిక రుసుముల నుంచి క్రెడిట్ కార్డు ఈఎంఐ వరకు కొన్ని విషయాల గురించి తప్పక తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. అప్పుడే క్రెడిట్ కార్డు వాడకంలో ఇబ్బందులు ఎదురుకావని చెబుతున్నారు. ఇంతకీ అవేంటి వాటి ఉపయోగం ఏంటనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.క్రెడిట్ కార్డు బిల్లును డ్యూ డేట్‌కి ముందు కంప్లీట్‌గా లేదా కొంతైనా కట్టకపోతే, మిగిలిన మొత్తంపై పడే వార్షిక వడ్డీ రేటును 'ఏపీఆర్' అంటారు. ఈ వార్షిక వడ్డీ రేటులో నార్మల్ వడ్డీతో పాటు ప్రాసెసింగ్ ఫీజు వంటి ఇతర రుసుములు కూడా యాడ్ అయి ఉంటాయి. నార్మల్‌గా ఈ వార్షిక వడ్డీ రేటు 36% నుంచి 42% వరకు ఉంటుంది. క్యాష్ అడ్వాన్స్, కొనుగోళ్లు, బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్, పెనాల్టీలు వంటి వాటికి ఏపీఆర్‌లు వేర్వేరుగా ఉండొచ్చు.క్రెడిట్ కార్డు వాడుతున్నందుకు గానూ ఏటా వసూలు చేసే మొత్తాన్ని 'వార్షిక రుసుము' అంటారు. ఈ రుసుము కొన్ని కార్డులకు ఉండదు. అలాగే, కొన్నింటికి ఒక నిర్దిష్ట మొత్తం ఖర్చు చేస్తే వార్షిక రుసుమును మాఫీ చేస్తారు.మీ దగ్గర ఉన్న క్రెడిట్ కార్డ్‌పై తీసుకోగల గరిష్ఠ మొత్తాన్నే 'క్రెడిట్ లిమిట్' అంటారు. బ్యాంక్ లేదా కార్డ్ జారీ చేసేవారు మీ ఆదాయం, క్రెడిట్ స్కోర్‌ను బట్టి మీ క్రెడిట్ లిమిట్‌ను డిసైడ్ చేస్తారని చెబుతున్నారు నిపుణులు.క్రెడిట్ కార్డ్ బిల్లులో లేట్ పేమెంట్ ఛార్జీలను నివారించడానికి తప్పనిసరిగా కనీస మొత్తం పే చేయాలి. ఇది మొత్తం బకాయిలో ఒక భాగం మాత్రమే అని అర్థం చేసుకోవాలి. నార్మల్‌గా ఈ మొత్తం బ్యాలెన్స్‌లో ఐదు శాతం ఉంటుంది. అయితే మిగిలిన బకాయిని తర్వాత బిల్లుకు యాడ్ చేస్తారు. దానిపై కూడా వడ్డీ పడుతుంది.మీ క్రెడిట్ కార్డ్ బిల్లు జనరేట్ అయ్యే టైమ్ పీరియడ్‌ను "బిల్లింగ్ సైకిల్" అని అంటారు. ఈ కాల వ్యవధి సాధారణంగా 28 నుంచి 31 రోజులు ఉంటుంది. క్రెడిట్ కార్డ్ జారీ చేసే సంస్థ ప్రతి బిల్లింగ్ సైకిల్ ముగింపులో ఒక స్టేట్‌మెంట్‌ను క్రియేట్ చేస్తుంది. అందులో మీ అన్ని కొనుగోళ్లు, మొత్తం బకాయి, కనీస బకాయి, పాత బకాయి, క్యారీ ఫార్వర్డ్ చేసిన బ్యాలెన్స్ వంటివన్నీ నమోదు అవుతాయని చెబుతున్నారు నిపుణులు.గ్రేస్ పీరియడ్ అంటే ఏమిటనగా, మీ క్రెడిట్ కార్డు బిల్లింగ్ డేట్‌కు, చెల్లింపు గడువు తేదీకి(పేమెంట్ డ్యూ డేట్) మధ్య ఉన్న వ్యవధి. ఈ టైమ్‌లో మీరు బిల్లు మొత్తాన్ని పూర్తిగా కడితే, కొనుగోళ్లపై ఎలాంటి వడ్డీ పడదు. కానీ, కంప్లీట్ బాకీ కట్టకపోతే కొనుగోలు చేసిన రోజు నుంచే ఇంట్రెస్ట్ లెక్కిస్తారు.జీతం వచ్చిన వెంటనే ఈ "7 పనులు" చేయండి! - భవిష్యత్‌లో అప్పులకు 'నో' ఛాన్స్!క్రెడిట్ కార్డ్ బిల్లులో మినిమమ్ అమౌంట్ డ్యూ కూడా కట్టనట్లయితే మీకు జరిమానా విధించే ఛాన్స్ ఉంటుంది. దాన్నే 'ఆలస్య చెల్లింపు రుసుము'గా పేర్కొంటారు. బ్యాంక్, కార్డ్ జారీ చేసిన సంస్థను బట్టి ఆలస్య చెల్లింపు రుసుము అనేది రూ.100 నుంచి రూ.1000 వరకు ఉండొచ్చు.మీరు కార్డు బిల్లు కట్టే కొద్దీ మీ క్రెడిట్ లిమిట్ తిరిగి అందుబాటులోకి వస్తుంది. దీన్నే రివాల్వింగ్ క్రెడిట్‌గా చెబుతారు. ఉదాహరణకు మీ లిమిట్ రూ.2 లక్షలు అయితే రూ.1 లక్ష ఖర్చు చేశారనుకుందాం. అప్పుడు మిగిలేది రూ.1 లక్ష. బిల్లు మొత్తం చెల్లిస్తే లిమిట్ మళ్లీ రూ.2 లక్షలవుతుంది. సగం మాత్రమే చెల్లిస్తే, లిమిట్ అందుకు తగ్గట్టు రూ.1.50 లక్షలే ఉంటుంది.ఇప్పటికే ప్రైమరీ/ స్టాండర్డ్ క్రెడిట్ కార్డు తీసుకున్నవారు అదనంగా మరో కార్డును తీసుకోవడాన్ని 'యాడ్-ఆన్ లేదా సప్లిమెంటరీ క్రెడిట్ కార్డ్' అంటారు. వ్యక్తిగత క్రెడిట్ కార్డులను అందిస్తున్న చాలావరకు సంస్థలు యాడ్-ఆన్ క్రెడిట్ కార్డ్ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. వ్యక్తులు తమ ఫ్యామిలీ మెంబర్స్ కోసం ప్రైమరీ క్రెడిట్ కార్డుకు అదనంగా యాడ్-ఆన్ కార్డును తీసుకోవచ్చు.క్రెడిట్ కార్డు ద్వారా ఏదైనా వస్తువు కొని ఆ బిల్లును వాయిదాల రూపంలోకి మార్చుకోవడాన్ని "జువీ×" అంటారు. బ్యాంకు నుంచి లోన్ తీసుకుని వాయిదాల్లో ఎలా చెల్లిస్తారో ఇది కూడా అలాగే పనిచేస్తుంది. కొన్నిసార్లు కొన్నిరకాల కొనుగోళ్లపై వడ్డీ పడుతుంది. కొన్ని కొనుగోళ్లపై నో-కాస్ట్ ఈఎంఐ అనే ఆప్షన్ ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.




# 28 ఏళ్లకే పీఎఫ్ నుంచి లక్ష తీస్తే

**రిటైర్మెంట్ వేళ ఎంత నష్టపోతారో తెలుసా**

**28 ఏళ్ల వయసులో పీఎఫ్ నుంచి లక్ష విత్‌డ్రా చేస్తే భారీ నష్టం**

**పదవీ విరమణ నాటికి రూ.11.78 లక్షల వరకు కోల్పోయే అవకాశం**

ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతా నుంచి చిన్న వయసులో డబ్బు విత్‌డ్రా చేయడం వల్ల పదవీ విరమణ నాటికి భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, 28 ఏళ్ల వయసులో ఒక ఉద్యోగి తన పీఎఫ్ ఖాతా నుంచి కేవలం రూ.1 లక్ష విత్‌డ్రా చేస్తే, 60 ఏళ్ల వయసు వచ్చేసరికి దాదాపు రూ.11.78 లక్షల వరకు నష్టపోతారని అంచనా. కాంపౌండింగ్ వడ్డీ ప్రయోజనాన్ని కోల్పోవడమే దీనికి ప్రధాన కారణం.ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) అందించే ఈ పథకంలో జమ అయ్యే డబ్బుపై ఏటా వడ్డీ లభిస్తుంది. ప్రస్తుతం ఇది సుమారు 8.25%గా ఉంది. 'మనీకంట్రోల్' కథనం ప్రకారం, పీఎఫ్ ఖాతాలోని డబ్బును ఎక్కువ కాలం కొనసాగించడం వల్ల చక్రవడ్డీతో పదవీ విరమణ నాటికి భారీ నిధి సమకూరుతుంది. మధ్యలో డబ్బు తీయడం వల్ల ఆ మొత్తంపై భవిష్యత్తులో వచ్చే వడ్డీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుంది.ఉద్యోగులు తమ జీతంలో కొంత భాగాన్ని, యాజమాన్యం మరికొంత భాగాన్ని ఈపీఎఫ్ ఖాతాలో జమ చేస్తాయి. వైద్య ఖర్చులు, ఇంటి నిర్మాణం, నిరుద్యోగం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, అత్యవసరం అయితే తప్ప పీఎఫ్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తికాకముందే డబ్బు విత్‌డ్రా చేస్తే పన్ను కూడా చెల్లించాల్సి రావచ్చు.అత్యవసర ఆర్థిక అవసరాలకు వ్యక్తిగత రుణాలు లేదా ఇతర మార్గాలను అన్వేషించాలని, పదవీ విరమణ భద్రత కోసం ఉద్దేశించిన పీఎఫ్ నిధిని కాపాడుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఉద్యోగం మారినప్పుడు పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేయకుండా, కొత్త కంపెనీకి బదిలీ చేసుకోవడం వల్ల కాంపౌండింగ్ ప్రయోజనాలు నిరంతరాయంగా కొనసాగుతాయి.




# చంచల్‌గూడ జైలుకు ప్రభాస్.. 'స్పిరిట్' కీలక షెడ్యూల్ షురూ!

రెబల్ స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన షెడ్యూల్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో హీరో ప్రభాస్ స్వయంగా పాల్గొనబోతున్నట్లు సమాచారం. కథలో ఎంతో కీలకమైన సన్నివేశాలను ఈ జైలు లొకేషన్‌లో చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. హై వోల్టేజ్ డ్రామా, యాక్షన్ సీక్వెన్స్‌లుగా సాగే ఈ సీన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని ఇండస్ట్రీ టాక్. సందీప్ రెడ్డి వంగా మార్క్ మేకింగ్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్ పూర్తవగానే ప్రస్తుత షూటింగ్ ఫేజ్ ముగుస్తుంది. వెంటనే ఎలాంటి బ్రేక్ లేకుండా తర్వాతి షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'స్పిరిట్'పై ప్రభాస్ ఫ్యాన్స్‌లో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.



# 'సింగ్ గీతం'కు ఫ్యామిలీ ఆఫర్.. తెలంగాణ మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధర తగ్గింపు!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 61వ చిత్రంగా తెరకెక్కిన 'సింగ్ గీతం' సినిమా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రంలో అయాన్, అహల్య ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మేకర్స్ తెలంగాణలోని మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు రూ.200గా ఉన్న టికెట్ ధరను రూ.175కు తగ్గించారు. ఫ్యామిలీ ఆడియన్స్‌కు సినిమా మరింత అందుబాటులో ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు పలువురు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా, తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ కూడా సపోర్ట్ చేస్తూ ప్రమోట్ చేశారు. ఈ పాజిటివ్ ఎండార్స్‌మెంట్స్, టికెట్ ధర తగ్గింపు వీక్ డేస్‌లో సినిమా వసూళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి. ఈ చిత్రంలో శాలిని కొండెపూడి, నివేదా పేతురాజ్, శివన్నారాయణ, బెనర్జీ, తులసి శివమణి, అగు స్టాన్లీ చియెడోజీ కీలక పాత్రల్లో కనిపించారు. విజయ్ దేవరకొండ స్పెషల్ క్యామియోలో మెరిశారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.



# లాభాల్లోకి సామ్ సినిమా.. 'బంగారం' వసూళ్లు ఎంతంటే?

చాన్నాళ్ల తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో వచ్చిన సమంత.. బాక్సాఫీస్ దగ్గర రచ్చ చేస్తోంది. టాక్ ఓ మాదిరిగా వచ్చినప్పటికీ, స్కూల్స్ కూడా తెరిచేసినప్పటికీ ఫ్యామిలీ ఈ మూవీ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదంతా కలెక్షన్స్ రూపంలో కనిపిస్తోంది. రెండు రోజుల్లో ఊహించని వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరుస్తోంది. ఇంతకీ ఎన్ని కోట్లు వచ్చాయి? సమంత ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'మా ఇంటి బంగారం'. ఇందులో హీరో ఎవరూ లేరు. నందిని రెడ్డి దర్శకత్వం వహించగా.. సామ్ భర్త రాజ్ నిడిమోరు, స్టోరీ అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించారు. విడుదలకు ముందు ఓ మాదిరి హైప్ ఉన్నప్పటికీ థియేటర్లలోకి సినిమా వచ్చిన తర్వాత మంచి వసూళు రాబడుతోంది. తొలిరోజు రూ.13.15 కోట్ల గ్రాస్ రాగా.. రెండు రోజులకు కలిపి రూ.28 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. అంటే రెండో రోజు ఏకంగా దాదాపు రూ.15 కోట్లు వచ్చినట్లే. ఈ నంబర్స్ బట్టి సమంత సినిమా.. తొలి రెండు రోజుల్లోనే లాభాల్లోకి వచ్చేసింది. ఈ సినిమా సక్సెస్ అవడంతో పాటు సమంత జీవితంలోనూ మరో ముందడుగు వేసింది. ప్రస్తుతం ఈమె ప్రెగ్నెన్సీతో ఉంది. శనివారం జరిగిన సక్సెస్ సెలబ్రేషన్‌లో బేబీ బంప్‌తో కనిపించింది. ఈ ఏడాది డిసెంబరులోనే బిడ్డకు జన్మనివ్వబోతుందని కూడా మాట్లాడుకుంటున్నారు. గతేడాది డిసెంబరులో దర్శకుడు రాజ్ నిడిమోరుని సమంత పెళ్లి చేసుకుంది.

# 'చెన్నై లవ్ స్టోరీ'తో మరో బ్లాక్‌బస్టర్ ఖాయం..



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా తిరుపతిలో నిర్వహించిన 'జిగితార' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా మాట్లాడిన కిరణ్ అబ్బవరం, 'క' సినిమా మంచి విజయాన్ని సాధించిందని, 'కె ర్యాంప్'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నామని, ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ' కూడా అదే స్థాయిలో విజయాన్ని అందుకుంటుందని పూర్తి నమ్మకంతో చెప్పారు. 'చెన్నై లవ్ స్టోరీ'లో తన పాత్ర ఇప్పటివరకు చేసిన సినిమాల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుందని కిరణ్ తెలిపారు. ఈ సినిమా కథ విన్నప్పుడు తన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తొచ్చాయని, ఆ కారణంగా ఈ కథతో చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యానని చెప్పారు. ఈ సినిమా నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తు చేసింది. చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యాను. ప్రేక్షకులు కూడా ఈ కథకు కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను అని కిరణ్ పేర్కొన్నారు.

# బిగ్‌బాస్ 10లోకి జబర్దస్త్ బ్యూటీ

## సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం!



తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే విజయవంతంగా తొమ్మిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం 'బిగ్‌బాస్ తెలుగు 10' ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పిస్తూ 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నారు. పదో సీజన్ కావడంతో హౌస్‌లో అనేక సర్‌ప్రైజ్‌లు, కొత్త గేమ్స్, వినూత్న టాస్కులు, భిన్నమైన కాన్సెప్ట్‌లు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టీవీ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లు బిగ్‌బాస్ కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కదలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ జాబితాలో తాజాగా మరో పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెనే జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర. జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి పలు కామెడీ షోల ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న పవిత్ర ప్రస్తుతం బిగ్‌బాస్ సీజన్ 10లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన పవిత్ర, తన ప్రతిభతో, కష్టంతో బుల్లితెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కామెడీ టైమింగ్, ఎనర్జీ, సహజమైన ప్రవర్తనతో ఆమె ప్రేక్షకులకు దగ్గరయ్యారు. గతంలో కూడా పవిత్ర పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా పలుమార్లు వినిపించింది. అయితే ఈసారి మాత్రం ఆమె హౌస్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోషల్ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బిగ్‌బాస్ టీమ్ ఆమెతో చర్చలు జరిపినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పవిత్ర నిజంగానే బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెడితే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదని అభిమానులు భావిస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com